సూర్య 17వ వసంతంలోకి
www.suryaa.com
నల్గొండ-యాదాద్రి-సూర్యాపేట
శనివారం 04, మే 2024 పేజీలు - 8

# కాంగ్రెస్ కోటలో కమలం 'ఢీ'

## రెండు లోక్‌సభలో కాంగ్రెస్ ఒంటెద్దు పోకడ

### మోడీ సంక్షేమ పథకాలే

### కమలం గెలుపు ధీమా !

### వెనుక బడిన బిఆర్ఎస్ ?



**ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో**

నల్గొండ ఉమ్మడి జిల్లాలో రెండు లోక్‌సభ స్థానాల్లో కమలం పాగా వేసేందుకు వ్యూహాత్మక రచనలతో ముందుకు సాగుతుంది. కాంగ్రెస్ మాత్రం భువనగిరి, నల్గొండ సిట్టింగ్ స్థానాలను దక్కించుకుంటామనే ధీమాతో ఒంటెద్దు పోకడ వ్యవహారం కనిపిస్తుంది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు 6 గ్యారెంటీలను ప్రకటించి అమలు చేయలేకపోయిందని బిజేపి, బిఆర్ఎస్ పార్టీల నేతలు విమర్శలు చేస్తున్నారు. రెండు లోక్‌సభ పరిధిలో కాంగ్రెస్ శాసనసభ్యులే గెలుపొందడంలో తామే గెలుస్తామని ధీమాతో కాంగ్రెస్ ఉంది. గత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 12 స్థానాలకు గాను 10 అసెంబ్లీ స్థానాల్లో బిఆర్ఎస్ గెలుపొందిన విషయం తెలిసిందే. కేవలం రెండు స్థానాలకు పరిమితమైన సమయంలో కూడా ప్రజలు బిఆర్ఎస్‌కు పట్టం కట్టకుండా నల్గొండ ఉత్తమ్ కుమార్ రెడ్డి, భువనగిరి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలను ఎంపీ అభ్యర్థులుగా గెలిపించి పలువురిని ఆశ్చర్యపరిచిన విషయం అందరికీ తెలిసిందే. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ప్రజలు అసెంబ్లీ ఎన్నికలకు 12 స్థానాలకు గాను 11 స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించారు. ఒక్కస్థానంలో మాత్రమే బిఆర్ఎస్ గెలిచింది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీని ప్రజలు ఆదరించి గెలిపిస్తారని మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ పేర్కొంటున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ప్రజలే తమ గోడును వెల్లబోసుకుంటున్నారని తిరిగి బిఆర్ఎస్‌ను గెలిపిస్తే కేంద్రంలో చక్రం తిప్పే అవకాశం వస్తుందని పేర్కొంటున్నారు. కమలం నాయకులు దేశవ్యాప్తంగా ప్రధాని మోడీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అందుకు ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి నల్గొండలోని రెండు పార్లమెంట్ స్థానాలకు ప్రజలకు బ్రహ్మరథం పడుతున్నారని మోడీ నాయకత్వాన్ని గెలిపిస్తేనే దేశం సుభిక్షంగా ఉంటుందని బిజెపి నాయకులు పేర్కొంటున్నారు. ఓటమి భయంతో కాంగ్రెస్ పార్టీ అమిత్‌షా, మోడీలపై అసత్య ఆరోపణలతో యూట్యూబ్‌లలో పేర్కొంటున్నారని దీని పరిణామం తీవ్రంగా ఉంటుందని రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి పేర్కొంటున్నారు. రెండు పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ నాయకులు గెలుపొందుతామనే ధీమాతో ఒంటెద్దు పోకడలను వ్యవహరిస్తుందని కాంగ్రెస్ కింది స్థాయి నాయకులు పేర్కొంటుండటం విశేషం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీల హామీలను నేటి వరకు నెరవేర్చలేదని ఆచరణకు సాధ్యం కాని హామీలతో గద్దెనెక్కారన్నారు. ఉమ్మడి జిల్లాలో బిఆర్ఎస్ ప్రచారంలో వెనుకబడిందని చెప్పవచ్చు. శాసనసభ్యులు లేకపోవడం కొంత నిరుత్సాహానికి గురవుతున్నప్పటికీ కాంగ్రెస్ మీద ఉన్న వ్యతిరేకతతో గెలుపొందుతామనే ధీమాతో బిఆర్ఎస్ అధినాయకత్వం ఉంది. ఇప్పటికైనా ప్రజలు మోసపూరిత వాగ్ధానాలకు గురైన వారు ఈసారి కమలం అభ్యర్థులను గెలిపిస్తారనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో కూడా పాత నాయకత్వాన్ని కలుపుకోని పోవడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో ప్రజలు ఏ పార్టీని ఆదరిస్తారో వేచి చూడాల్సిందే...

---



# కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం

### - భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

### - మూసి ప్రక్షాళన కాంగ్రెస్‌తోనే సాధ్యం

### - పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరిక

భూదాన్‌పోచంపల్లి, మేజర్‌న్యూస్ : కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం అవుతుందని, గత పది ఏళుగా భువనగిరి ప్రాంతాన్ని మూసి కాలుష్యం బారిన పడేసిన బిఆర్ఎస్ ప్రభుత్వమని అధికారంలోకి వచ్చి మూడు నెలలు కాకముందుకే మూసి ప్రక్షాళన కోసం 1000 కోట్ల కేటాయించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం లోక్‌సభ ఎన్నికల విస్తృతస్థాయి పర్యటనలో భాగంగా భూదాన్‌పోచంపల్లి మండల పరిధిలోని దేశ్‌ముఖి, పిల్లాయిపల్లి, జగత్‌పల్లి, పెద్దగూడెం, జూలూరు, కప్రాయపల్లి, పెద్దరావులపల్లి, ఇంద్రియాల, శివారెడ్డిగూడెం, రామలింగంపల్లి గోస్ కొండ గ్రామాలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట తప్పకుండా మూడు నెలల లోపే ఐదు గ్యారంటీ పథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వందని ఆయన అన్నారు. ప్రజా సంక్షేమం ప్రజాభివృద్ధి కాంగ్రెస్ లక్ష్యాలను ఆయన అన్నారు .ఖమ్మంలో 20వేల కోట్లతో 40 లక్ష ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన తెలిపారు. మూసి ప్రక్షాళన మారిన ఈ నియోజకవర్గ పూర్తిగా మస్కబారిందని దానికోసం ఇప్పటికే ప్రక్షాళన కార్యక్రమాన్ని ప్రారంభించింది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన తెలిపారు. బునాది గాని కాలువ పిలాయిపల్లి కాలువ, ధర్మారెడ్డిపల్లి కాలువ, పూర్తిస్థాయి నిర్మాణాలు లేకుండా జాప్యం చేసింది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆయన విమర్శించారు. త్వరలోనే బునాదిగాని, ధర్మారెడ్డిపల్లి కాలువలకు 600 కోట్ల నిధులను కేటాయించి పూర్తిస్థాయిలో నిర్మాణం లక్ష్యంగా పనిచేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. చెప్పిన మాట ప్రకారం రైతులందరికీ ఆగస్టు 15 లోపు రెండు లక్షల రుణ మాఫీ చేయడం ఖాయమని ఆయన అన్నారు. మతం పేరు చెప్పుకొని ఓటు అడుక్కుంటూ దేశాన్ని కార్పొరేటర్లకు దారా దత్తం చేస్తుంది బిజెపి ప్రభుత్వమని ఆయన విమర్శించారు. దేశప్రజలంతా సమానమేనని దేశాన్ని ముందుకు తీసుకెళుతుంది రాహుల్ గాంధీని రానున్న ఎన్నికల్లో దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం ఖాయమని ఆయన అన్నారు. ఈ ప్రాంతం పూర్తిస్థాయిలో అభివృద్ధి జరగాలంటే ఎంపీ, ఎమ్మెల్యే ఒకే పార్టీ వారై ఉండాలని అలాంటప్పుడే పూర్తిస్థాయి అభివృద్ధి జరుగుతుందని ఆయన అన్నారు.చామల కిరణ్ కుమార్ రెడ్డి మిగతా 5లో

# తీన్మార్ మల్లన్న నామినేషన్ సన్నహాక సమావేశం

### - దేశ సంపదను ఆదాని, అంబానీలకు దోచిపెడుతున్న మోడీ

### - పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ నాలుగు ముక్కలవుతుంది

### - 46 జీవోపై వచ్చే అసెంబ్లీలో కమిటీ వేసి రద్దు చేస్తాం

### - ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్నను లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాలి

### - రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

### - ఎమ్మెల్సీగా గెలిపిస్తే రాజకీయాలలో సమూల మార్పులు తీసుకువస్తా

### - ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న



నల్లగొండ టౌన్, మేజర్‌న్యూస్ : మోడీ ప్రభుత్వం దేశ సంపదనంతా ఆదాని, అంబానీలకు దోచిపెడుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టబద్ధుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న నామినేషన్ సందర్భంగా శుక్రవారం నల్గొండలోని ఏచూరి గార్డెన్స్‌లో జరిగిన సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉండి చేసిన అభివృద్ధి ఏమీ లేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాసంక్షేమ ధ్యేయంగా ముందుకు పోతుందని అన్నారు. ఇచ్చిన 5 గ్యారంటీలలో ఇప్పటికే ఐదు గ్యారంటీలను అమలు చేస్తున్నామన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత కెసిఆర్, కేటీఆర్‌లు మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని ఎద్దేవ చేశారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఆ పార్టీ నాలుగు ముక్కలవుతుందని వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నప్పుడు కెసిఆర్ ప్రజల సొమ్మును దోచుకోవడంతో కూతురు కవిత జైలుకెళ్ళిందని, వారు కూడా జైలుకెళ్లక తప్పదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తూ ముందుకు పోతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి, బీఆర్ఎస్ లకు ఒక్క సీటు కూడా రాదని తెలిపారు. పట్టబద్ధుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న తనకున్న ఆస్తిని ప్రభుత్వానికి రాసిచ్చి ఎమ్మెల్సీగా పోటీ చేయడం మామూలు విషయం కాదన్నారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికలలో తీన్మార్ మల్లన్నను లక్ష మెజార్టీతో మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలిపించాలని కోరారు. జీవో 46తో నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. వచ్చే అసెంబ్లీ సమావేశంలో ఈ జీవోపై కమిటీ వేసి రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ ఎమ్మెల్సీగా ఒక్క అవకాశం ఇస్తే రాజకీయాలలో సమూల మార్పులు తీసుకువస్తానని స్పష్టం చేశారు. గత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పల్లా రాజేశ్వర్ రెడ్డి దొంగ ఓట్లతో, అవినీతి సొమ్ముతో గెలుపొందాడని విమర్శించారు. గెలిచిన తర్వాత చేతకాక నిరుద్యోగులను వంచనకు గురి చేశాడని ధ్వజమెత్తారు. గ్రాడ్యుయేట్లంతా ఈ ఎన్నికలలో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్న తన కుటుంబానికి ఉన్న ఒక కోటి 50 లక్షల రూపాయలను ప్రభుత్వానికి రాసిస్తున్నట్లు ప్రకటించారు. తనకు మద్దతునిస్తున్న రాజకీయ పార్టీలకు, ప్రజా సంఘాలకు, విద్యార్థి సంఘాలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం పాల్గొని ప్రసంగించగా, నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, గుత్తా అమిత్ రెడ్డి, నల్గొండ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, జడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, తిప్పర్తి జడ్పిటిసి పాశం రామ్ రెడ్డి, చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకటరెడ్డి, నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, ట్రస్మా సంఘం నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు పాల్గొన్నారు.

# కాంగ్రెసోళ్లు భూమ్మీద లేరు గాలిలో ఉన్నారు



చండూర్, మేజర్‌న్యూస్ : కాంగ్రెసోళ్లు భూమ్మీద లేరు గాలిలో తేలాడుతున్నారని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. శుక్రవారం లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా చండూరు పట్టణ కేంద్రంలోనీ రోడ్ షో లో ఆయన మాట్లాడుతూ పెద్ద ఎత్తున తరలివచ్చిన అన్నదమ్ములకు అక్కాచెల్లెళ్లకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను.మీ అందరి ఉత్సాహం చూస్తా ఉంటే నాకు మాత్రం నమ్మకం కలిగింది భువనగిరి మీద ఎగిరేది గులాబీ జెండేనని. స్వార్థం కోసం కొంతమంది నాయకులు పార్టీ మారోచ్చు, పార్టీ కోసం పనిచేసే నాయకులు కార్యకర్తలు కేసీఆర్ తోటి ఉన్నారనీ పేర్కొన్నారు. కొంతమంది రైతులు రైతుబంధు అడిగితే కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రైతులను చెప్పుతో కొడతానని అన్నాడని పేర్కొన్నారు.ప్రమాణ స్వీకారం చేసి కుర్చీలో కూర్చోగానే గానే రైతు రుణమాఫీ చేస్తా అన్నాడు, ఆరోజు బాండ్ పేపర్ రాసిచ్చిండు,మరి ఈ వంద రోజుల్లో ఎందుకు అమలు చేయలేదనీ దుయ్యబట్టారు.ఏ ఊరికి పోతే ఆ ఊర్లో దేవుడి మీద ఒట్టు పెడతా ఉండని చెప్పారు.మహిళలకు ఇచ్చిన మహాలక్ష్మి నెలకు 2500 అమలు చేయడంలో మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం10000 రూపాయలు బాకీ పడి ఉండని తెలిపారు. రైతుబంధు 15000 ఇస్తా అన్నాడు ఇప్పటికి ఎంత మందికి ఇచ్చారో, మేము ఇచ్చిన వారికి కూడా ఇవ్వలేదని విమర్శించారు.కరోనా కష్ట కాలంలో మంత్రులకు ఉద్యోగులకు జీతాలు ఆపి రైతులకు రైతుబంధు ఇచ్చిన ఘనత కేసిఆర్ దేనని తెలియజేశారు. వృద్ధులకు 4000 ఇస్తానన్నాడు,ఇచ్చాడా.. అని సభలో ప్రశ్నించారు. రైతులు రుణమాఫీ చేయలేదని ప్రశ్నిస్తే రేవంత్ రెడ్డి ఏ ఊరికి పోతే ఆ ఊరు దేవుడు మీద ప్రమాణం చేసి చెప్తుండనీ వెలిబుచ్చారు. ఆగస్టు 15 లోపు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు రెండు లక్షల రుణమాఫీ అమలు చేస్తే నేను నా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, ముఖ్యమంత్రి పదవి కి నువ్వు రాజీనామా చేయడానికి సిద్ధమేనా సవాల్ విసిరారు. రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి కావాలి, రైతులకు రుణమాఫీ కావద్దా.. వృద్ధులకు 4000 పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు.వంద రోజులు అమలు చేస్తా అని బాండ్ పేపర్ ఇచ్చిన కాంగ్రెస్ లకు వాల్ పేపర్ కాలం చెల్లింది మరి శిక్ష పడాల వద్ద అని ప్రజలకు కోరారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు కావాలంటే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్కు చురుకు పెట్టాలనీ కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చినాక బంగారం ధరలు, కందిపప్పు ధరలు, సిమెంట్ ధరలు, పెరిగాయి.కార్యకర్తలు ఇంటింటికి పోయి కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించాలనీ కార్యకర్తలను పిలుపునిచ్చారు.చామల కిరణ్ కుమార్ రెడ్డికి ఏ గుణగణాలు ఉన్నాయని పార్లమెంట్ టికెట్ ఇచ్చారు, రాహుల్ గాంధీ సంతకాన్ని పోర్జరీ చేసినందుకు టికెట్ ఇచ్చారా అని ఏదేవ చేశారు.బీసీలంతా ఐక్యమత్తంగా ఉండి బిసి బిడ్డని గెలిపించి బీసిల ఐక్యత చాటాలి.పది సంవత్సరాలలో బిజెపి గవర్నమెంట్ కేంద్రంలో ఏ ఒక్క మంచి పని కూడా చేయలేదు.చండూరును రెవెన్యూ డివిజన్ చేసింది కేసీఆర్ అన్నారు. 570 కోట్లు చండూరు డెవలప్మెంట్ కోసం నిధులు విడుదల చేస్తే. అభివృద్ధి పనులు ఎక్కడెక్కడే నిలిచిపోయాయి. కరెంటు కోతలు మొదలైనాయి... కాంగ్రెస్ వచ్చింది కరెంటు మాయమైందనీ చెప్పారు. బిఆర్ఎస్‌కు ఓటేయ్యాలని ప్రజల సిద్ధంగా ఉన్నారనీ తెలిపారు.తెల్ల కాగితం లాంటివాడు మన క్యామా మల్లేష్ అన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, భువనగిరి పార్లమెంటు అభ్యర్థి క్యామ మల్లేష్, మాజీమంత్రి జగదీశ్వర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి, జడ్పీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తోకల చంద్రకళ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

# రైతుపై తూటా

చందంపేట, మేజర్‌న్యూస్ ః రైతాంగ ఆత్మహత్యలు నివారిస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని హామీలిచ్చి కేంద్రంలోను, మధ్యప్రదేశ్‌లోను అందలమెక్కిన బీజేపీ ప్రభుత్వాలు అన్నదాతలపైనే తుపాకీ ఎక్కుపెట్టడం హేయమైన చర్య. ఒకవైపు కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ మరో వైపు రైతులను పిట్టలను కాల్చినట్టు కాల్చిపడేసిన పాలకుల కిరాతకాన్ని ఎంత ఖండించినా తక్కువే. మధ్యప్రదేశ్‌లో రైతులు తాము పండించిన పంటకు మద్దతు ధర కావాలని అడిగారు. ఎన్నికల ముందు బీజేపీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మాత్రమే వారు కోరారు. రైతులపైకి పోలీసులను ఉసిగొల్పి ఆరుగురిని పొట్టనబెట్టుకోవడం దుర్మార్గం. సమస్యను చర్చల ద్వారా పరిష్కరించుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏ ప్రభుత్వమైనా నిర్వర్తించాల్సిన కనీస బాధ్యత. దీనిని విస్మరించి నిరంకుశంగా అణచివేయాలని చూడడం అప్రజాస్వామికం. మధ్యప్రదేశ్‌లో మొదట ఒక జిల్లాలో ప్రారంభమైన రైతుల ఆందోళన క్రమంగా రాష్ట్రంలోని మిగతా అన్ని జిల్లాలకు విస్తరించింది. మందసోర్, పిప్లియామండీ ప్రాంతాల్లో ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించి రైతుల పోరాటాన్ని అణచివేయాలని చూసింది. ఈ పాపంలో శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వానికీ వాటా వుంది. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేండ్లు గడిచినా రైతాంగాన్ని ఆదుకునేందుకు ఎలాంటి చర్య తీసుకోలేదు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదు. నయా ఉదారవాద విధానాలతో ఇప్పటికే సంక్షుభితంగా మారిన వ్యవసాయరంగం మోడీ ప్రభుత్వ నిర్వాకం వల్ల మరింత తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడింది. మధ్యప్రదేశ్‌లో కాల్పులు దీనికి పరాకాష్ట. కేవలం ఒక్క మధ్యప్రదేశ్‌లోనే కాదు, బీజేపీ పాలిత రాష్ట్రాల్లోను, దాని మిత్రపక్షాలు అధికారంలో వున్న రాష్ట్రాల్లోను రైతు వ్యతిరేక విధానాలు ఉధృతంగా అమలవుతున్నాయి. మొత్తం రైతు ఆత్మహత్యల్లో 60శాతం దాకా ఈ రాష్ట్రాల్లోనే చోటు చేసుకున్నాయని అధికారిక గణాంకాలే వెల్లడిస్తున్నాయి. మొదట గుజరాత్ రైతాంగం వీధుల్లోకి వచ్చింది. నేడు మహారాష్ట్రలో రైతాంగ పోరాటాలు ఉధృతంగా సాగుతున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే ఈనాడు బీజేపీ ప్రభుత్వ విధానాలపై ఈ దేశ రైతాంగం తిరుగుబాటు చేస్తోంది. మధ్యప్రదేశ్‌లో రైతాంగ పోరాటం, మహారాష్ట్రలో రైతులు వారం రోజుల పాటు నిర్వహించిన సమ్మె, రాష్ట్ర బంద్ అసాధారణమైనది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర అనే కాదు, మిగతా రాష్ట్రాల్లోనూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై రైతాంగంలో ఆగ్రహం రగుల్కొంటోంది. చత్తీస్‌ఘడ్, హర్యానా, జార్ఖండ్‌ల్లో రైతాంగ పోరాటాలు సాగుతున్నాయి. రైతుల పోరాటానికి బాసటగా నిలవాలని సామాజిక కార్యకర్త అన్నా హజారేను రైతు సంఘాలు కోరగా ఆయన అందుకు నిరాకరించారు. ఇది ఆయన సంకుచిత ధోరణికి నిదర్శనం. ఎఐకెఎస్, ఇతర రైతు సంఘాల ఆధ్వర్యాన మహారాష్ట్ర రైతులు పట్టుదలతో పోరాడుతున్నారు. రైతులు తమ నిరసనలో భాగంగా వ్యవసాయోత్పత్తులను పట్టణాలకు సరఫరా చేయడానికి నిరాకరిస్తున్నారు. వాటిని రోడ్లపై పారబోస్తున్నారు. మహారాష్ట్రలోని ఫడ్నవీస్ ప్రభుత్వం రైతులతో చర్చించి సామరస్యంగా దీనిని పరిష్కరించుకోవడానికి బదులు ఈ ఉద్యమాన్ని అణచివేయాలని చూడడం అవివేకం. తమిళనాడులో 140ఏండ్లలోనే అతి పెద్దకరువు గత సంవత్సరం చోటు చేసుకుంది. ఈ కరువు బారిన పడి ఇప్పటివరకు 400మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విపత్కర పరిస్థితినుంచి తమిళనాడును ఆదుకునేందుకు 40వేల కోట్ల ప్యాకేజీ కావాలని తమిళనాడు రైతులు నలభై రోజులకుపైగా ఆందోళన నిర్వహించారు. రాజధాని ఢిల్లీలో దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. రైతులు ఎంత ఘోషించినా రుణమాఫీ చేసే ప్రసక్తే లేదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ తెగేసి చెప్పారు. కరువుతో అల్లాడుతున్న తమిళనాడుకు ఇంతవరకు పైసా కూడా సాయం చేయలేదు. పైగా సుప్రీం కోర్టులో దీనిపై కేంద్రం తన వాదన వినిపిస్తూ తమిళనాడులో రైతులెవరూ ఆత్మహత్య చేసుకోలేదని చెప్పింది. ఇది తమిళప్రజలతో క్రూర పరిహాసమాడటమే. రైతులను ఉద్ధరించేందుకే తెచ్చానని ఘనంగా చెప్పుకున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన రైతులకు అక్కరకు రాలేదు. కానీ కార్పొరేట్ బహుళజాతి కంపెనీలకు దండిగా కాసులపంట పండించింది. ఫసల్ బీమా యోజన కింద 2016-17లో ప్రయివేట్ బీమా కంపెనీలు ప్రీమియం రూపంలో రైతుల నుంచి 21,500 కోట్లు దండుకున్నాయి. గత ఖరీఫ్ సీజన్‌లో రైతులు పరిహారం కింద 4,270 కోట్లు క్లెయిమ్ చేయగా, 714 కోట్లు మాత్రమే ఇచ్చాయి. దీనిని బట్టి ఈ ఫసల్ బీమా యోజన ఎవరికోసం ఉద్దేశించిందో ఇట్టే అర్థమవుతోంది. వ్యవసాయరంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించడం, మేడ్ ఈజీ బిజినెస్ వంటి విధానాల ద్వారా మోడీ సర్కార్ ఈ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెడుతున్నది. దీనికి వ్యతిరేకంగా గ్రామీణ పేదలు, రైతులు, వ్యవసాయ కూలీలు, ఆదివాసీలు సమైక్య పోరాటాలను ఉధృతం చేయడం ఒక్కటే మార్గం.

# వివక్ష లేని సమాజం కోసం

సమాజంపై అవగాహన ఎందరికో ఉండొచ్చు... మార్చాలనే తపన కొందరికే ఉంటుంది. అలా తపించే వారిలో ప్రొఫెసర్ లక్ష్మి ఒకరు. సమానత్వం, వివక్ష లేని మరో సమాజం కోసం నిరంతరం పోరాడుతున్నారు. విద్యార్థి దశ నుంచే హ్యూమనిస్టుగా, యాక్టివిస్టుగా స్త్రీ సమానత్వం కోసం గొంతు విప్పారు. ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీకి మొదటి మహిళా ప్రిన్సిపల్‌గా చరిత్ర సృష్టించారు. రిటైర్‌మెంట్ తర్వాత కూడా స్త్రీ సమస్యలపై తన పోరాటం ఆపలేదు. ముఖ్యంగా ఇటీవల రాష్ట్రంలో పెట్రేగుతున్న కుల దురహంకార హత్యలకు వ్యతిరేకంగా తన గొంతు విప్పుతున్న ఆమెతో మానవి సంభాషణ...

ఇటీవల మన రాష్ట్రంలో కులదురహంకార హత్యలు బాగా జరుగుతు న్నాయి. వీటికి కారణం ఏమిటి?

ఇవి గతంలో కూడా ఉన్నాయి. అయితే బయటకు వచ్చే వాటి సంఖ్య చాలా తక్కువ. ఇప్పుడు మీడియా పెరిగిపోవడం వల్ల బయటకు ఎక్కువగా వస్తున్నాయి. కులం, మతం, మూఢనమ్మకాలు, సంప్రదాయాలు, ఇలా వీటన్నింటి వల్ల తల్లిదండ్రులు, కులపెద్దలు పిల్లల ఇష్టాలను అంగీకరించడం లేదు. రోజురోజుకు సమాజంలో కుల సమస్య పెరిగిపోతుంది. అందుకే ఈ హత్యలు జరుగుతున్నాయి.

ఈ వివాహాల వల్ల అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యలు?

మొదట తల్లిదండ్రులు ఆమె ప్రేమను అంగీకరించరు. ఇంట్లో వాళ్ళ ఇష్టాన్ని కాదని పెండ్లి చేసుకుంటే ఇల్లు వదిలి వెళ్ళిపోవాలి. సమాజం కూడా అమ్మాయి నిర్ణయాన్ని స్వాగతించదు. ఇలాంటి పరిస్థితుల్లో ఒక్కరికైనా ఉద్యోగం లేకపోతే బతకడం కష్టం. ఆర్థిక ఇబ్బందులు వస్తాయి. ఈ ప్రభావం అమ్మాయిలపైనే ఎక్కువగా ఉంటుంది.

అసలు తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే అవకాశం అమ్మాయిలకు ఎంత వరకు ఉందంటారు?

ఈ పితృస్వామ్య సమాజంలో ఆడపిల్లతో పాటే ఆంక్షలు, కట్టుబాట్లు కూడా వుడతాయి. ఎలాంటి బట్టలు వేసుకోవాలి?, ఎలా మాట్లాడాలి?, ఏం తినాలి?, ఎంత తినాలి? వరకు అన్నీ ఆంక్షలే. పెండ్లి సంబంధం వస్తే 'ఈ అబ్బాయి నాకు ఇష్టం లేదు' అని అంటే 'నోరుమూసుకో ఇంకెవరికీ చెప్పకు, నీ చెల్లెళ్ళకు పెండ్లి కాదు' అంటారు. రాజ్యాంగం ప్రకారం వివాహానికి సంబంధించి సమ్మతి హక్కు అమ్మాయికి ఉంది. కానీ దాన్ని ఎవ్వరూ పట్టించుకోరు. అమ్మాయికి జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కు, భావప్రకటనా స్వేచ్ఛ కల్పించాలి.

తల్లి ఇంటి పేరు, కులం పెట్టుకోవడంలో ఎన్నో ఆటంకాలు ఉన్నాయి. దీని గురించి మీరేమంటారు?

ఏ బిడ్డకైనా తల్లి ఒక వాస్తవం, తండ్రి ఓ నమ్మకం. తొమ్మిది నెలలు మోసిన తల్లి కులం బిడ్డకు వర్తించదంటారు. ఇది సరైనది కాదు. గతంలో స్కూల్లో తండ్రిపేరే అడిగేవారు. కానీ మహిళా ఉద్యమాల ఫలితంగా తల్లిపేరు కూడా చేర్చు కోగ లిగాం. అలాగే ఓ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం పిల్లలు తల్లిదండ్రుల కులాల్లో తమకు ఇష్టమైన ఏ కులాన్నైనా పెట్టుకోవచ్చు.

మొదటి నుంచి మానవీయ విలువలతో పెరిగారు. మీ బాల్యం ఎలా గడిచింది?

మాది మిర్యాలగూడ. అక్కడే పుట్టి, పెరిగాను. అమ్మ విరాటమ్మ, నాన్న రామచంద్రయ్య. ఇద్దరూ వ్యవసాయం చేస్తారు. అమ్మ చాలా కష్టపడేది.

మా ఇంట్లో అన్ని కులాల వారినీ సమానంగా చూసేవారు. మేము ఎనిమిది మంది సంతానం. మా అమ్మ చదువు కోలేదు. నాన్న కొద్దిగా చదువుకు న్నారు. కానీ.. సామాజిక అవగాహనతో మమ్మల్ని చదివించారు. అయితే పదో తరగతి పూర్తి కాగానే ఆడపిల్లకు పెండ్లి చేయాలి అని భావించే పల్లెటూరు మాది. నాకూ అలాగే చేయాలనుకున్నారు. అయితే నేను ఒప్పుకోలేదు. స్కూల్ టాపర్ కావడంతో అన్నయ్యలు సపోర్ట్ ఇచ్చి ఇంటర్‌లో చేర్చారు. తర్వాత ఖమ్మంలో మా అన్నయ్య ఇంట్లో ఉండి అక్కడే డిగ్రీ చేశాను. మళ్ళీ ఇంటికి వెళితే పెండ్లి చేస్తారని అటునుంచి అటే స్నేహితులతో కలిసి హైదరాబాద్ వెళ్ళి పీజీకి ఎన్‌ట్రన్స్ రాశాను. మా ఊరి నుంచి ఎంట్రన్స్ రాసిన వారిలో యూనివర్సిటీలో సీటు వచ్చింది నాకొక్కదానికే. దాంతో ఊళ్ళో అందరూ మెచ్చుకున్నారు. దాంతో అమ్మానాన్నలు గర్వపడ్డారు. నేను ధైర్యం చేసి ఇంటికి వెళ్ళి డబ్బులు తెచ్చుకుని పీజీ పొలిటికల్ సైన్స్‌లో చేరాను. అలా మా కుటుంబంలో ఉన్నత విద్యను చదవిన మొదటి ఆడపిల్లను నేనే.

టీచింగ్‌వైపుకు ఎందుకు వచ్చారు?

పీజీ పూర్తి చేసిన తర్వాత బ్యాంక్ ఉద్యోగం కూడా వచ్చింది. కానీ ఆ టేబుల్ వర్క్ చేయడానికి మనసు అంగీకరించలేదు. ఎమ్‌ఫిల్‌లో చేరాను. తర్వాత 'మహిళా నాయకత్వం' అనే అంశంపై పీహెచ్‌డీ చేశాను. ఎప్పటికైనా అవినీతి ఉండని జాబ్ చేయా లనుకున్నాను. అప్పట్లో అలాంటి జాబ్ టీచింగ్. దాంతో ఇక టీచింగ్ చేయాలని నిర్ణయించుకున్నాను. ఈ వృత్తిలోకి వచ్చిన తర్వాత యంగ్ టీచర్, బెస్ట్ టీచర్ అవార్డు తీసుకున్నాను. 2002లో ప్రొఫెసర్‌గా, తర్వాత ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు నిర్వహించాను.

మరి యాక్టివిస్టుగా ఎలా మారారు?

విద్యార్థినిగా లేడిస్ హాస్టల్ వార్డెన్‌గా బాధ్యతలు చూసేదాన్ని. అక్కడే అనేక విద్యార్థి సంఘాలతో పరిచయాలు ఏర్పడ్డాయి. మా హాస్టల్లో పని చేసే వర్కర్లు ఉండే బస్తీలకు వెళ్ళి వాళ్ళకు అక్షరాలు నేర్పించేవాళ్ళం. యూనివర్సిటీలో ఏ అన్యాయం జరిగినా వ్యతిరేకించేవాళ్ళం. సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం చేసేవాళ్ళం. జెండర్ సమస్యపై, సేవ్ గర్ల్ చైల్డ్ లాంటి ఎన్నో కార్యక్రమాలు చేశాం. ఉమెన్స్ స్టడీ సెంటర్ డైరెక్టర్‌గా మరెన్నో కార్యక్రమాలు చేశాం. ముఖ్యంగా అమ్మాయిలకు లీగల్, సోషల్ కౌన్సెలింగ్ ఇచ్చేవాళ్ళం.

మీదీ కులాంతర వివాహమే కదా, ఏమైనా సమస్యలు ఎదుర్కొన్నారా?

సమస్యలేమీ లేవు. మా వారి పేరు శివాజీ. ఆయన నాతో పాటు పీహెచ్‌డీలో చేశారు. దండలు కూడా మార్చుకోకుండా రిజిష్టర్ ఆఫీస్‌కు వెళ్ళి సంతకాలు పెట్టి వచ్చేశాం. పెద్దలు మాత్రం రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఆయనా లెక్చరర్‌గా చేసేవారు. అది మానేసి ప్రస్తుతం 'సర్వ్' అనే సోషల్ ఆర్గనైజేషన్‌లో పని చేస్తున్నారు. గ్రామాల్లో దళితులు, చెంచుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. మాకు ట్రిపులెట్ బేబీస్. ముగ్గురు బాబులు. ప్రస్తుతం ఇంటర్ పూర్తి చేసి పై చదువులకు సిద్ధంగా ఉన్నారు.

ఇన్ని బాధ్యతలు నిర్వర్తించారు. మీరెప్పుడైనా జెండర్ సమస్యను ఎదుర్కొన్నారా?

నేను స్ట్రాంగ్. అందుకే నా జోలికి ఎవ్వరూ రారు. అయితే యూనివర్సిటీలో జెండర్ సమస్యలు చాలా ఉన్నాయి. వీటిపై కచ్చితంగా పని చేసేవాళ్ళం. ఇప్పటికీ చేస్తున్నాం.

సరైన గైడెన్స్ ఇస్తే...

మహిళలు ఓ వ్యక్తిత్వంతో పెరగాలి. చదువుకోవాలి. స్వతంత్రంగా బతికే హక్కు ఉంది అని నమ్మాలి. నీ శరీరంపై నీకు హక్కు ఉండాలి. తనలో ఉన్న శక్తిని గుర్తించాలి. నేను ఆడపిల్లను అనే భావనను పక్కన పెట్టాలి. శారీరకంగా, మానసికంగా స్ట్రాంగ్‌గా ఉండాలి. నా కెరీర్‌లో ఎంతో మంది విద్యార్థులను చూశాను. యువతకు సరైన గైడెన్స్ ఇస్తే మంచి దారిలో వెళతారు. నా దృష్టిలో టీచర్ అంటే పుస్తకాల్లో ఉండేది నాలుగ్గోడల మధ్య చెప్పడం కాదు, సమాజం గురించి, జీవితం గురించి నేర్పాలి. ఉపాధ్యాయులు ఇలా చేయగలిగితే ప్రతి అమ్మాయి, అబ్బాయి ఆణిముత్యాల్లా తయారవుతారు.

ప్రత్యేక చట్టం కావాలి

దేశంలో సమసమాజం రావాలన్నా, కులర హిత సమాజం ఏర్పడాలన్నా, స్త్రీ-పురుషుల మధ్య అంతరాలు తొలగించాలన్నా కులాంతర వివాహాలు చేసుకునే వారికి కొన్ని అవకాశాలు కల్పించాలి. వీరికి రక్షణ కల్పించే ప్రత్యేక చట్టం కావాలి. ముందు ఆ జంటకు ఆర్థికంగా సహకరించాలి. ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. అమ్మాయిలకు ధైర్యం చెప్పాలి. వారి పిల్లలకు అన్నింట్లో 5 శాతం రిజర్వేషన్ కల్పించాలి. అలాగే భద్రత అనేది కీలకం. కాబట్టి వీరి వివాహాలను రికార్డ్ చేయాలి. అన్నింటి కంటే ముఖ్యంమైనది ఇలాంటి వివాహాల పట్ల సమాజానికి అవగాహన కల్పించాలి.

# లక్ష్యం

నాంపల్లి, మేజర్‌న్యూస్ : పడుకున్నవాడు లేచి తిరిగి మళ్లీ పడుకోవడమే జీవితమని కొందరంటున్నారు. 'కలకానిది విలువైనది జీవితం' అన్నాడు.. శ్రీశ్రీ. జీవితం ప్రవాహం, జీవితం నది, జీవితం స్రవంతి. ప్రవాహం నిరంతరం కదులుతుంటుంది. కదలికలేని ప్రవాహం లేదు. నది నిరంతరం చలనంతో ఉంటుంది. అయినా చలించినట్టు కనబడదు. నిరంతరం కదులుతూ కదిలినట్టు కనిపించనిదే జీవితం అంటాడు దాశరథి రంగాచార్య. నది ప్రవాహం జీవనవేగాన్ని సంకేతిస్తున్నది. నీటి పరుగు చైతన్యాన్ని సూచిస్తున్నది. జీవిత ప్రవాహం ప్రచండ వేగంతో వెళ్లిపోతూ ఉంది. అందులో ఎవరెవరి సంస్కారాన్ని బట్టి వాళ్లు తమ సుఖం కోసం కొట్లాడుకుంటున్నారు అంటాడు అసమర్థుని జీవయాత్రలో గోపీచంద్. అసలు మనం సక్రమంగా జీవించలేకపోతున్నాం... జీవితంలో అనేకనేక అవకాశాలు మన ముందు కొస్తుంటాయి. అన్నీ ముఖ్యమనిపించినా ఎదురైన ప్రతి అవకాశం అందిపుచ్చుకోలేము. అందుకే జీవితానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానికున్న అవకాశాలను పరిశీలించుకుని ముందుకు పోవాల్సి ఉంటుంది. నీటి ప్రవాహాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. ప్రవాహానికి అడ్డువస్తే నీళ్లు అక్కడే ఆగిపోవు. కొత్తదారి వెతుక్కొని కొండల్లో జలపాతాలుగా రాళ్ల మధ్య పాయలుగా, ఇసుకమేటల్లో ఏర్లుగా ప్రయాణాన్ని సాగిస్తాయి. విద్యార్థి అయితే తాను ఏ వృత్తిలో స్థిరపడదలచుకున్నాడో లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి. అందుకనుగుణమైన కోర్సునే ఎంచుకోవాలి. ఊహల్లో విహరించకుండా వ్యూహంతో చదివితే లక్ష్యం సిద్ధిస్తుంది. ఎక్కడో మారుమూల ప్రాంతంలో పేదరికంతో పోరాడుతూ... గోపాలకృష్ణ ఐఏఎస్ లక్ష్యంగా నిర్దేశించుకుని విజయం సాధించిన అనుభవం మన కండ్లముందే కనబడుతున్నది. "ఒక నదిని దాటడం నీ లక్ష్యమైతే.. అందుకు నావగాని, వంతెన గాని లేకుండా నదిని దాటడం సాధ్యం కాదు" అన్నాడు మావో. అంటే లక్ష్యం మంచిదైనా దాన్ని చేరుకోవడానికి నిర్ణయించుకునే సాధనాలపైన జయపజయాలు ఆధారపడి ఉంటాయి. ఏ లక్ష్య సాధనకైనా క్రమశిక్షణ అవసరం. వ్యక్తిగత లక్ష్యాలతో లాభనష్టాలూ కష్టసుఖాలు ఆయా వ్యక్తుల వరకే పరిమితం అవుతాయి. అదే మన సమాజానికి బాధ్యత వహించినప్పుడు సమిష్టి లక్ష్యంగా మారుతుంది. తప్పుడు లక్ష్యాల వల్ల మనమే కదా నష్టపోయేది అనుకుంటే కుదరదు. దాని ప్రభావం మొత్తం సమాజంపైనా ఉంటుంది. లక్ష్యాలు ఉన్నతమైనవైతే సాధనఎలాంటివైనా పరవాలేదా? శంకరాచార్యుడు జీవాత్మ – బ్రహ్మాత్మల ఏకత్వాన్ని తెలుసుకోవడమే లక్ష్యం అన్నాడు. ఇందుకు జ్ఞాన సంపాదన మార్గమన్నాడు. వీరు వాస్తవ జీవితంతో సంబంధం లేని లక్ష్యాన్ని ఎంచుకున్నారు.

కమ్యూనిస్టుల దృష్టిలో జీవిత లక్ష్యం మానవజాతి సుఖసంపదలతో జీవించడం. భౌతికంగానూ, సాంస్కృతికంగానూ అంతకంతకు ఉన్నత శిఖరాలకు అందుకోవడం. ప్రతి మానవుడు తోటి వారితో కలిసి మానసిక శక్తులను అభివృద్ధి చేసుకోవడానికి అంతకంటే ఎక్కువ స్వేచ్ఛ సంపాదించడం. పరాయి పాలనకు స్వస్తిపలికి స్వాతంత్ర్యం సాధించుకునేందుకు భారత ప్రజలు శత సంవత్సరాలు పోరుసల్పారు. ఈ వందేండ్ల స్వాతంత్ర్య పోరాటం మన లక్ష్యంగా ఉన్నది. లక్ష్యం మహోన్నతమైనదని అందరూ అంగీకరించారు. ఏకాభిప్రాయానికి వచ్చారు. కానీ సాధన మార్గం విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవచ్చు. అహింసను జీవిత లక్ష్యంగా పెట్టుకున్న గాంధీ మహాత్ముడే పిరికితనంతో బానిస జీవితం గడపడం కన్న దౌర్జన్యంతో శత్రువును ప్రతిఘటించడం మంచిదన్నాడు. ఉరితీయబడ్డ భగత్‌సింగ్ దేశభక్తిని పొగుడుతూనే అతడు ఎంచుకున్న మార్గం సరైనది కాదంటూ గాంధీజీ పెట్టిన తీర్మానం కాంగ్రెస్‌లో వీగిపోయింది. ఆ కాలంలో దేశం కోసం పోరాడి అమరులైన వారందరు వీరులుగా కీర్తింపబడ్డారు. స్వాతంత్ర్యం సిద్ధించింది. అప్పుడు ఏంచేయాలి అనే ప్రశ్న ముందుకు వచ్చింది. ఒక సమస్యను పరిష్కరిస్తే ఆ సమస్య పరిష్కారంలో మరొక సమస్య వుట్టుకొస్తుంది. ఒక గమ్యాన్ని చేరుకొని అక్కడే ఆగిపోవడం కాదు. ఎప్పటికప్పుడు సమస్త అవకాశాలను వినియోగించుకుంటూ నూతన లక్ష్యాలను చేరుకోవటం. విజయాల మీద విజయాలు సాధిస్తూ కొనసాగించే అనంతయాత్ర, అట్టి యాత్రలో ప్రతిలక్ష్యం ఒక మజిలీ, మరొక లక్ష్యాన్ని సాధించడానికి అదొక ప్రారంభం. నూతన లక్ష్యాలను నిర్దేశించుకునేటప్పుడు మన మార్గం, గమ్యాన్ని బట్టీ పరిస్థితులను బట్టీ కూడా ఉంటుంది. గమ్యాన్ని మరచిపోతే కోరిన లక్ష్యం కాక విరుద్ధమైన ఫలితాలు వస్తాయి. భారత రాజ్యాంగంలో సోషలిజం లక్ష్యంగా ప్రకటించారు. దాన్ని సాధించాలంటే పెట్టుబడిదారీ పద్ధతులు ఎన్నటికీ పనికిరావు. నెరవేరని లక్ష్యాలు పెట్టుకుంటే ఎవరైనా కొంత కాలానికి గందరగోళంలో పడిపోతారు. భవిష్యత్తు చీకటిగా మారుతుంది. మనిషి సంఘ జీవితాన్ని నియంత్రించటానికి రాజ్యం ఏర్పడింది. అది ఏది చెయ్యాలి, ఏది చేయకూడదో చెబుతుంది. అది ఎక్కువ మందిని బాధపెట్టే స్థితికి వస్తుంది. ఆ బాధలు ఏంచేస్తే పోతాయో లక్ష్యం నిర్ణయించుకోవాలి. బాధలు లేని సమాజం కోసం పాటు పడాలి. ఏదీ తనంత తానై నీదరికిరాదు శోధించి సాధించాలి అదే ధీరగుణం అంటాడు శ్రీశ్రీ. అందుకే ఆదర్శ సమాజ నిర్మాణానికి అందరం అంకితమవుదాం. అలిశెట్టి ప్రభాకర్ అన్నట్టు అన్నం ముద్దలాంటి ఆశయాన్ని అందరం కలిసి, పంచుకుందాం. యుద్ధరంగమైన జీవితాన్ని ఒక్కటిగానే ఎంచుకుందాం.

# జీఎస్‌టీ

నార్కట్‌పల్లి, మేజర్‌న్యూస్ : జీఎస్‌టీ అమలుతో పేదలకు లాభం జరుగుతుందని చెప్పిన మోడీ అమెరికాలో 20 టాప్ కంపెనీల సీఈఓల సమావేశంలో వస్తుసేవల పన్ను సంస్కరణలు చేశామనీ, భారత పన్నుల విధానం అమెరికా బిజినెస్ పాఠశాలల్లో పాఠ్యాంశంగా చేర్చవచ్చునని ప్రచారం చేస్తున్నారు. మనదేశ భక్తులు బడుగుల నెత్తిమీద చెయ్యిపెట్టి బడా కార్పొరేట్ సంస్థలకు స్వాగతం పలుకుతున్నారు. మోడీ ద్వంద్వ నీతి బట్టబయలైంది.

కేంద్ర ప్రభుత్వం వస్తుసేవల పన్ను ప్రారంభాన్ని ఒక పెద్ద ఘనకార్యంగా భావిస్తోంది. కేంద్ర పన్నుల విధానానికి వ్యతిరేకంగా వస్త్ర వ్యాపారులు బంద్ పాటించారు. వివిధ రకాల నిరసనలు తెలుపుతున్నారు. వస్త్ర పరిశ్రమలో వెయ్యి రూపాయలు విలువగల వస్త్రాలు కొంటే ఒక పన్ను విధానం, దాటితే మరొక పన్ను విధించటం వల్ల పన్నులు భారంగా పరిణమించనున్నాయి. ముఖ్యంగా చేనేత వస్త్రాల ఉత్పత్తి ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి జీఎస్‌టీ భారంతో చేనేతరంగం మరింత రక్షణ లేకుండాపోయే ప్రమాదం ఉంది. బీడీ పరిశ్రమ దివాళా తీసి లక్షలాదిమంది బీడీ కార్మికులు ఉపాధిలేక రోడ్డున పడతారు. పాత పన్నుల విధానంలో 18శాతం పన్ను చెల్లిస్తున్నారు. ఇప్పుడు 28శాతానికి పెరగడం వలన అమ్మకాలు పడిపోతాయి. పరిశ్రమలు మూతపడతాయి. కాబట్టి బీడీ పరిశ్రమను జీఎస్‌టీ నుండి మినహాయించాలనే కోరిక సమంజసమైనదే. ఒకప్పుడు పాలకులు చిన్న పరిశ్రమలను పెద్ద పరిశ్రమల పోటీ నుండి కాపాడేందుకు ప్రత్యేకమైన పన్ను రాయితీలు ఇచ్చేవారు. ఇప్పుడు టర్నోవర్‌ను నామమాత్రంగా పెంచి పన్ను భారాల నుండి మినహాయింపు లేకుండా చేశారు. పన్నుల భారం, కార్పొరేట్ సంస్థల పోటీ తట్టుకోలేక పరిశ్రమలు మూతపడతాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. మరొకవైపు జీఎస్‌టీ అమలు వలన లక్షల ఉద్యోగాలు వస్తాయని ఊదరగొడుతున్నారు. పాలకులు నిరుద్యోగులను భ్రమలకు గురిచేస్తున్నారు.

దేశంలో ఇప్పటికి 60శాతం మందికి పైగా వ్యవసాయం మీద ఆధారపడి పనిచేస్తున్నారు. ఈ రంగం అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నది. పంటలకు గిట్టుబాటు ధరలు రాక అన్నదాతలు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. జీఎస్‌టీ వ్యవసాయ రంగాన్ని కూడా విడిచిపెట్టలేదు. గతంలో అన్ని రకాల ఎరువుల మీద వ్యాట్ 5శాతం మాత్రమే ఉండేది. వస్తుసేవల పన్నులు అమలు అయితే అదనంగా 7శాతం పన్ను పెరుగుతుంది. అదే స్థాయిలో ఎరువుల ధరలు కూడా పెరుగుతాయి. క్రిమి సంహారక మందుల మీద 18శాతానికి పన్నులు పెరుగుతాయి. గోరుచుట్టుపై రోకటిపోటులాగా ఇప్పుడు జీఎస్‌టీ పన్నుల వలన రైతు నెత్తిన అప్పులు పెరుగుతాయి. ప్రజలెవ్వరూ కోరకుండా పన్నుల విధానాలలో పాలకులు మార్పులు ఎందుకు చేస్తున్నారు? అసలు దేశమంతా ఒకే పన్ను పద్ధతి పాటించాలని ఎవరు బలవంత పెట్టారు? కేంద్ర పాలకులు కార్పొరేట్ శక్తుల పంచన చేరారు. ముందు రిటైల్ రంగంలో సంస్కరణలు చేశారు. వాల్‌మార్ట్ లాంటి సంస్థలకు స్వదేశీ గుత్త సంస్థలకు తలుపులు తెరిచారు.

కార్పొరేట్ పంజరంలో చిక్కిన అధికార పార్టీ చిలుకలు ఒకే దేశం ఒకే పన్ను ఉండాలనే చిలుక పలుకులు పలికారు. ప్రజలకు లాభం జరుగుతుందని ప్రచారం చేశారు. ఏకాభిప్రాయ సాధన పేరుతో అనేక ప్రయత్నాలు చేసి, పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ ద్వారా ఒకే పన్ను ఆమోదింపజేసుకున్నారు. ఫెడరల్ వ్యవస్థపై వేటు వేశారు. గతంలో పన్నుల వ్యవస్థ కేంద్రం చేతిలో ఉండాలా రాష్ట్రం చేతిలో ఉండాలా అని రాజ్యాంగ నిర్మాతలు చర్చించి ప్రత్యక్ష పన్నులు కేంద్రం, పరోక్ష పన్నులు రాష్ట్రాలకు హక్కు భుక్తం చేశారు. ఒకే పన్ను విధానం రావడంలో కేంద్రం ముందు రాష్ట్రాలు సాగిలపడే పరిస్థితి వచ్చింది. వస్తుసేవల పన్నును నిర్ణయించడానికి జీఎస్‌టీ కౌన్సిల్ ఏర్పడింది. గతంలో పరోక్ష ప్రత్యక్ష పన్నుల వసూలు ఉండేది. ఇప్పుడు మొత్తం పన్నులను మూడు కేటగిరీలుగా విభజించి పన్నులు వేయాలని నిర్ణయించారు. జీఎస్‌టీ సమావేశానికి హాజరైన రాష్ట్ర మంత్రి తారక రామారావు కొత్తచట్టం వలన రూ. 11వేల కోట్ల భారం తెలంగాణపై పడుతుందని తెలిపారు. ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే ఇన్ని భారాలు పడితే దేశ ప్రజలపై ఎంత భారం పడుతుందో తలుచుకుంటేనే కడుపు తరుక్కుపోతోంది. ముందూ వెనకా ఆలోచించకుండానే టీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రం అడిగిందే తడవుగా జీఎస్‌టీని ఆమోదించిన ఫలితంగా ప్రజలపై పెద్ద ఎత్తున భారాలు పడుతున్నాయి. వస్తుసేవల పన్ను విధానంలో మార్పులు జరగాలంటే కేంద్రానికి ఇష్టం లేకుండా ఏదీ జరగదు. కౌన్సిల్‌లో 75శాతం మంది ఆమోదిస్తేనే అమలు జరుగుతుంది. కానీ మొత్తం రాష్ట్రాల ఓటు విలువ 66.6శాతం మాత్రమే. అందుకే టీఆర్ఎస్ ప్రభుత్వం చేతిలో ఉన్న హక్కును పోగొట్టుకొని, బీడీ పరిశ్రమకు మిషన్ భగీరథకు పన్ను మినహాయించాలని కోరడం అత్యంత విచారకరం. జీఎస్‌టీ అమలు కాకముందే రాష్ట్రాల మీద కేంద్రం పెత్తనం పెరిగింది. భవిష్యత్‌లో ఇంకా పెరుగుతుంది. తెలంగాణలో పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేశామని బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వాస్తవాలు ఏమిటో బయటపెట్టారు. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏంలాభం? జీఎస్‌టీ అమలుతో పేదలకు లాభం జరుగుతుందని చెప్పిన మోడీ అమెరికాలో 20 టాప్ కంపెనీల సీఈఓల సమావేశంలో వస్తుసేవల పన్ను సంస్కరణలు చేశామనీ, భారత పన్నుల విధానం అమెరికా బిజినెస్ పాఠశాలల్లో పాఠ్యాంశంగా చేర్చవచ్చునని ప్రచారం చేస్తున్నారు. మనదేశ భక్తులు బడుగుల నెత్తిమీద చెయ్యిపెట్టి బడా కార్పొరేట్ సంస్థలకు స్వాగతం పలుకుతున్నారు. మోడీ ద్వంద్వ నీతి బట్టబయలైంది.

# బతకాలంటే యుద్ధం చేయాలా ?

త్రిపురారం, మేజర్‌న్యూస్ : ఏలికలకు రైతులు అక్కరలేదేమో...! కానీ ఈ దేశానికి రైతులు కావాలి... భూమిని బువ్వగా మార్చి ప్రజల ఆకలి తీర్చడానికి ఈ దేశానికి రైతులు కావాలి. అందుకు వారికి భూమి కావాలి... సాగుకు సాయం కావాలి. నెత్తురు చెమటగా చేసి, సత్తువ ధారపోసి మన్నును అన్నంగావించే వ్యవసాయం వారికి ఫలసాయం కావాలి.... మన ఏలికలకు రైతులు అక్కరలేదు కానీ, రైతుకు ఆధారమైన భూమి కావాలి. భూమి మీద గాలి, నీరు, మట్టితో పాటు భూమి తన గర్భంలో దాచుకున్న అనంతమైన సంపద కావాలి. ఎవరి కోసం..? ప్రజల కోసమే అనుకుంటే పొరబాటు..! కంపెనీల కోసం... కంపెనీల యజమానుల కోసం..!! ఎందుకంటే వారి సేవకే ఈ ప్రభుత్వాలు. ఇవి పైకి ప్రజలెన్నుకున్న ప్రభుత్వాలుగానే కనిపిస్తాయి. కానీ ఇవి కార్పొరేట్లు కోరుకున్న ప్రభుత్వాలు. వీరు తలచుకుంటే అమెరికాలో నిలువెల్లా టెంపరితనం నిండిన ట్రంప్‌నైనా అధ్యక్షుడిని చేయగలరు, ఇండియాలో గుజరాత్‌ను రక్తసిక్తం చేసిన మోడీనైనా ప్రధానిని చేయగలరు. కానీ అక్కడ ట్రంపైనా, ఇక్కడ మోడీ అయినా సేవలు చేయవలసింది ఈ కార్పొరేట్ కంపెనీలకే... వారి కృషి మొత్తం ప్రకృతి సంపదను, మానవ శ్రమను కొల్లగొట్టి వీరికి కట్టబెట్టడానికే. ఇప్పుడు ప్రపంచమంతటా జరుగుతున్న ఈ తతంగమే దేశంలోనూ జరుగుతున్నది. మన రాష్ట్రంలోనే కాదు దేశమంతటా రైతుల్లో చెలరేగుతున్న అసంతృప్తి జ్వాలలన్నీ దీనికి సూచికలే..!

దిక్కుతోచక రైతులు పంటలను తగుల బెట్టుకోవడం, మార్కెట్ యార్డుల వద్ద ధర్నాలు చేయడం మాత్రమే చూసిన దేశానికి తొలిసారిగా 'సమ్మె' సెగను చూపించారు మహారాష్ట్ర రైతులు. లక్షలాది లీటర్ల పాలను బజారులో పారించి, టన్నుల కొద్ది కూరగాయలను వీధుల్లో కుమ్మరించి, వేలాది గేదెలతో రహదారులను దిగ్బంధనం చేసి ప్రభుత్వానికి దిమ్మతిరిగేలా చేశారు మధ్యప్రదేశ్ రైతులు. వీళ్లేం చేస్తారులే అన్న అధికారుల అలసత్వానికి, ప్రభుత్వ అహంకారానికి తిరుగుబాటు రుచి చూపించారు తెలంగాణ రైతులు. వీరందరికంటే ముందు మోడీ స్వరాష్ట్రంలోనే ఈ పోరాటాలకు శ్రీకారం చుట్టారు గుజరాత్ రైతులు. దేశం నడిబొడ్డున మన ప్రభుత్వాల చేతకాని తనాన్ని ఎలుగెత్తి చాటారు తమిళ రైతులు. కానీ మన ప్రభుత్వాలేం చేస్తున్నాయి. ఆవేదన ఆవుకోలేక సమ్మెకు దిగిన రైతును నిర్దాక్షిణ్యంగా నిర్బంధించింది మహారాష్ట్ర ప్రభుత్వం. గుండె మంటను తట్టుకోలేక రోడ్డెక్కిన రైతుకు "తూపాకీ గుండ్ల"తో సమాధానం చెప్పింది మధ్యప్రదేశ్ ప్రభుత్వం. కడుపు మండి కండ్లు తెరిపించే ప్రయత్నం చేసిన రైతుకు సంకెళ్ళు వేసింది తెలంగాణ ప్రభుత్వం. ఇంతకీ వీరు చేసిన నేరమేమిటి..? ప్రభుత్వాలే ప్రకటించిన ఉచిత విద్యుత్, సాగునీరు కావాలన్నారు. రుణమాఫీని గుర్తుచేసారు. పాల ధరను పెంచమన్నారు. చేసిన కష్టానికి, పెట్టిన పెట్టుబడికి తగిన ధర అడిగారు. ప్రజాస్వామ్యంలో వారికి ఆ మాత్రం హక్కులేదా..? కాళ్ళకింద నేల కరిగిపోతుంటే, రెక్కల కష్టం నక్కల పాలవుతుంటే రైతులేం చేయాలి పోరాడటం తప్ప...!

నేటికీ మనది వ్యవసాయ దేశం. 70శాతం మంది ప్రజలు వ్యవసాయం మీదే ఆధారపడి జీవిస్తున్నారు. ఆ ప్రజలనే పట్టించుకోని ఈ ప్రభుత్వాలనేమనాలి. గతంలో రైతులకు చేతల్లో ఏమీ చేయకపోయినా కనీసం మాటల్లోనైనా రైతే దేశానికి వెన్నెముక అనీ, జై జవాన్.. జైకిసాన్.. అని నినదించేవారు ఏలికలు. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వంలో ఆ మాత్రం ప్రస్తావన కూడా కనిపించకపోవడం ఈ ప్రభుత్వ వైఖరిని చెప్పకనే చెవుతోంది. అధికారంలోకి రాకముందు మేనిఫెస్టోల్లో తప్ప అధికారంలోకొచ్చాక రైతుల ఊసే మరిచిపోయారు. రైతులకు రుణమాఫీ అన్నారు. దేశంలో గానీ, రాష్ట్రంలో గానీ అప్పునపడ్డ రైతులెందరూ, రుణ విముక్తి కలిగించింది ఎందరికీ..? ప్రపంచంలోనే అత్యధిక ఉత్పత్తి చేసే మన మిర్చి రైతుల హాహాకారాలను ఎవరు పట్టించుకున్నారు...? వ్యవసాయ రంగంలోకి ప్రవేశిస్తున్న కార్పొరేట్ కంపెనీలకు, భూస్వాములకు, వాణిజ్య బ్యాంకుల ద్వారా వేల కోట్ల పంట రుణాలనిచ్చిన ఈ ప్రభుత్వాలు పేద రైతులను మాత్రం ప్రయివేటు రుణాల బారిన పడేసి ఆత్మహత్యల పాలు చేశాయి. దేశంలో 70శాతం ప్రజల జీవన్మరణ సమస్యను దాచిపెట్టి అభివృద్ధి గురించి మాట్లాడటం కాన్సర్ వుండుకు ప్లాస్టర్ వేయడమే.... అది గాయాన్ని కనిపించనీయదు కానీ మాన్పించలేదు కదా..!

అది తెలంగాణ కావొచ్చు, ఆంధ్రా కావొచ్చు, కేంద్రం కావొచ్చు... ఇలాంటి ప్రభుత్వాలన్నీ రైతును ఆత్మహత్య తప్ప గత్యంతరం లేని స్థితికి నెట్టి, వ్యవసాయాన్ని నిరుత్సాహపరచి భూమికి దూరం చేయడమే లక్ష్యంగా సాగుతున్నాయి. వివిధ శక్తుల స్వార్థ ప్రయోజనాల కోసం రకరకాల పద్ధతుల్లో భూఆక్రమణే ఏకైక అజెండాగా కదులుతున్నాయి. ఈ తెర వెనుక కుట్రల ఫలితమే నేటి రైతాంగ సంక్షోభం. కానీ అంతిమంగా ప్రజలే నిర్ణేతలన్న విషయాన్ని నేతలు గుర్తుంచుకోవాలి. "భూమి గుండ్రంగా ఉంది. తన చుట్టూ తాను తిరుగుతూ, సూర్యుని చుట్టూ తిరగడం వలన పగలు, రాత్ర ఏర్పడుతున్నాయి" అని చెప్పినందుకు శాస్త్రవేత్తలకు మరణదండన విధించిన చరిత్ర మన పాలకవర్గాలది. ఎందుకంటే భూమి తమ చుట్టూ తిరగాలనీ, తమ గుప్పిట్లో ఒదగాలని వారి కోరిక.. కానీ అది సాధ్యమా..?

# ఇదేనా సుపరిపాలన ?

ఏలినవారి లీలలు రోజురోజుకీ వింత గొల్పుతున్నాయి. సుపరిపాలనకు తమను తామే ఓ నమూనాగా ప్రచారం చేసుకునేవాళ్లు, అవినీతి అక్రమాలకు ఆమడదూరమని ప్రకటించుకునేవాళ్లు, క్రమశిక్షణకు నిబద్ధతకు మారుపేర్లమని నీతులు బోధించేవాళ్లు ఏపాటి పనిమంతులో ఆచరణలో పదేపదే రుజువవుతున్నది. వీరి విధానాల ఫలితంగా దగాపడిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించండి మొర్రో అంటూ వీధుల్లోకొచ్చి పోరాడుతుంటే విధులు మరిచిన నేతలు వింత వింత విన్యాసాలు చేస్తూ ప్రజలను, ప్రజా ఉద్యమాలను అపహాస్యం చేస్తున్నారు. దేశవ్యాపితంగా రైతాంగం ఆకలి చావులతో, ఆత్మహత్యలతో అల్లాడుతుంటే నేతలు యోగాసనాలు వేసుకోండి అంటూ సూక్తులు వల్లిస్తున్నారు. ప్రత్యేకించి బీజేపీ పాలిత రాష్ట్రాలు రైతుల ఆగ్రహజ్వాలలతో మండుతుంటే అర్థంలేని దీక్షలు చేస్తూ నీరో చక్రవర్తులను తలపిస్తున్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలి వినోదాల్లో తేలియాడుతున్నారు.

బీజేపీ పాలనలో దళితులు, ముస్లింలే కాదు, ఇప్పుడు రైతులు కూడా దేశ రాజకీయ చదరంగంలో పావులుగా మారుతున్నారు. అటు బీజేపీ గానీ, ఇటు టీఆర్ఎస్ గానీ స్వాభిమానంతో బతికే రైతును ప్రభుత్వాల సహాయం మీద ఆధారపడే స్థితికి దిగజార్చి వ్యవసాయాన్ని సంక్షోభంలో కొనసాగిస్తున్నాయి. ఓట్లు అవసరమైనప్పుడు రుణమాఫీ లంటున్నాయి. అవసరం తీరాక ఆ ఊసే మరిచిపోతున్నాయి. అంతెందుకు మన రెండు తెలుగు రాష్ట్రాలలో కూడా అధికారం కోసం ఇద్దరు చంద్రులు రుణమాఫీలు ప్రకటించారు. కానీ అధికారం చేపట్టి మూడేండ్లు ముగుస్తున్నా ఆ రుణమాఫీ ఇంకా సాగుతూ...నే ఉంది..! అప్పట్లో దీనిని వ్యతిరేకించిన ప్రధాని నరేంద్రమోడీ ఉత్తరప్రదేశ్‌లో అధికారం కోసం ఇదే రుణమాఫీని ప్రజలకు వాగ్దానం చేశారు..!! ఇప్పుడేమో "రుణమాఫీ ఒక ఫ్యాషన్ అయిపోయింది' అంటూ వెంకయ్యనాయుడు హేళన చేస్తున్నారు. ఇదంతా ఏరుదాటి తెప్ప తగలేసిన చందంగా ఉంది. ఫలితంగా ఈ దేశంలో ప్రభుత్వాల విధానాల వలన దగాపడుతున్న ప్రజానీకంలో రైతులు ముందు వరుసలోకి వస్తున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అయితే ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉన్నది.

# వేసవి ఉచిత క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభం




నూతనకల్, మేజర్‌న్యూస్ : జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సూర్యాపేట వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేసవి ఉచిత క్రీడా శిక్షణ శిబిరమును మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రారంభించినట్లు క్రీడల శిక్షకులు జలగం మల్లికార్జున్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏనుగుతల చంద్రయ్య, జడ్.పి.హెచ్.ఎస్ ప్రధానోపాధ్యాయులు ఉయ్యాల ప్రసాదులు హాజరైనట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సీనియర్ క్రీడాకారులు గుండా వీరన్న, అనంతుల మధు, విజయ్, మనోజ్, సురేష్, మహేష్ లతో పాటు 20 మంది క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలను తనిఖీ చేసిన ఎంపీడీవో



నూతనకల్, మేజర్‌న్యూస్ : ఈ నెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఎన్నికల సిబ్బందికి, ఓటర్లకు ఏర్పాటు చేసే మౌలిక సదుపాయాల ఏర్పాట్లను మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని వసతులను ఎంపీడీవో సునీత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండ తీవ్రత అధికంగా ఉన్న దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు చలువ పందిళ్ళ ఏర్పాటుకై పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శశికళ, పంచాయతీ కార్యదర్శి శర్మ, కారోబార్ శంబయ్య, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సన్మానించిన సాగర్ ఎమ్మెల్యే

హాలియా, మేజర్‌న్యూస్ : నల్గొండ జిల్లా అనుముల మండలం హాలియా ప్రభుత్వ పాఠశాలలో ఎస్ఎస్‌సి ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థినీలను సన్మానించిన నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జయవీర్. నల్గొండ జిల్లా అనుముల మండలం హాలియా ప్రభుత్వ పాఠశాలకు చెందిన పిట్టల రమ్య శ్రీ, రమావాత్ తారక రూప విద్యార్థినిలను తాజాగా విడుదలైన ఎస్ఎస్‌సి ఫలితాలలో అత్యధికమార్కులు సాధించిన సంధర్భంగా వారిని అభినందించి, సన్మానించిన నాగార్జున సాగర్ శాసనసభ్యులు కుందూరు జయవీర్. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకట్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ కాకునూరి నారాయణ, నల్గొండ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గౌని రాజారమేష్ యాదవ్ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



## రాజ్యాంగ వ్యతిరేకి బిజెపి పార్టీని ఓడించండి

# కాంగ్రెస్ పార్టీని గెలిపించండి

### మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్



హాలియా, మేజర్‌న్యూస్ : రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తున్న బిజెపి నియంతృత్వ బీఆర్ఎస్ పార్టీలను ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపినర్ మాజీ ఎమ్మెల్సీ సపవట్ రాములు నాయక్, కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపియనర్ మాజీ ఎమ్మెల్సీ సభావట్ రాములు నాయక్, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ అంజయ్య నాయక్ లు గిరిజన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హాలియా పాత ఐటిఐ కాలేజ్‌లో వివిధ గిరిజన సంఘాల నాయకులతో మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో బిజెపి పార్టీకి 400 సీట్లు ప్రజలు ఇస్తే ఎస్సీ ఎస్టీ, బిసి మైనార్టీలకు వర్తిస్తున రిజర్వేషన్లను రద్దు చేస్తామని బాహటంగా బిజెపి పార్టీ మోడీ చెప్పడం అంటే మనువాదాన్ని అమలు చేయాలని చూస్తున్నారన్నారు నల్లగొండ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ శ్రీరామ్ నాయక్ మాట్లాడుతూ దేశంలో ఆర్ఎస్ఎస్ బిజెపి పార్టీలు గిరిజన సంస్కృతి సాంప్రదాయాలపై దాడులు చేయిస్తూ ఉపకులాల మధ్య ఆహార అలవాట్ల పైన గొడవలు పెడుతూ చిచ్చు లేపుతున్నరన్నారు. బిజెపిని ఓడించి కాంగ్రెస్ కూటమిని గెలిపించాలని కోరారు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో 17 స్థానాలలో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో సిపిఎం పార్టీకి మద్దతు ఇస్తూ మిగిలిన 16 స్థానాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామన్నారు. తెలంగాణ గిరిజన సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ మాట్లాడుతూ ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను సంపూర్ణంగా మద్దతిస్తూ వారిని గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కోర్ర శంకర్ నాయక్, గిరిజన ప్రజా సమైక్య రాష్ట్ర కార్యదర్శి రమావత్ నాగేందర్ నాయక్, కౌన్సిలర్ ప్రసాద్ నాయక్, రమావత్ నరేష్ నాయక్, సర్దార్ నాయక్, మాజీ సర్పంచ్ బాలునాయక్, ఎంపీటీసీ తుల్చనాయక్, హనుమంతు నాయక్, రాజు నాయక్, రవి నాయక్, మోతిలాల్, నాగు భగవాన్, ముని దత్తు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# తీవ్రమైన ఎండల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### - ఎంపిపి దూదిపాల రేఖాశ్రీధర్ రెడ్డి



కొండమల్లేపల్లి, మేజర్‌న్యూస్ : కొండమల్లేపల్లి పరిసర ప్రాంత ప్రజలు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొండమల్లేపల్లి ఎంపిపి దూదిపాల రేఖా శ్రీధర్ రెడ్డి తెలిపారు. కొండమల్లేపల్లి పరిసర ప్రాంతంలోని పలు చోట్ల 45డీ డిగ్రీల పైగా ఉష్ణోగ్రత నమోదు కావడం వలన ప్రజలు ఆందోళనకు, అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. అధిక ఉష్ణోగ్రత ఉండడం వల్ల ప్రజలు వడదెబ్బకు గురి కాకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. బయటకు వెళ్లి వచ్చిన తర్వాత అలసటగా అనిపించడం, శరీరం వేడి కావడం, తలనొప్పి, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే చక్కెర ఉప్పు ద్రవాలతో పాటు శీతల పానీయాలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ పనులకు వెళ్ళే వారు ఉదయమే వెళ్ళి త్వరగా ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. ఎవరికి వారే స్వీయ రక్షణ పాటించాలని అన్నారు. తప్పనిసరి అయితే తప్ప మధ్యాహ్నం సమయంలో బయటకు రాకుండా ఉండాలని కోరారు.

# ఎంపీ అభ్యర్థి కిరణ్ కుమార్ రెడ్డి గెలుపు కోసం ప్రచారం



మునుగోడు, మేజర్‌న్యూస్ : భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపు కోసం శుక్రవారం మండల సమన్వయ కమిటీ ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలలో ప్రస్తుత విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 6 గ్యారంటీ పథకాలను ప్రతి ఒక్కరికి వివరిస్తూ చామల కిరణ్ కుమార్ రెడ్డి చేయి గుర్తు మీద ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15 తేది లోపు కచ్చితంగా రుణమాఫీ అమలు చేస్తారన్నారు కాంగ్రెస్ పార్టీతోనే ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భీమనపల్లి సైదులు, మాజీ ఎంపీపీ పోలగోని సత్యం, జిల్లా నాయకులు వేమీరెడ్డి జితేందర్ రెడ్డి, నన్నూరి విష్ణువర్ధన్ రెడ్డి, జాల వెంకటేశ్వర్లు, చెరుకుపల్లి వెంకన్న, ఎండి రఫీక్, పాపయ్య, గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరిన బిఆర్ఎస్ యువ నాయకులు



మునుగోడు, మేజర్‌న్యూస్ : మండలంలోని చీకటిమామిడి గ్రామం బిఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అనుచరులు రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు యంపళ్ళ సైదులు, నాయకులు గండు లక్ష్మయ్య,తాజా మాజీ వార్డు సభ్యులు జీడిమడ్ల అనిత బాబు, జీడిమడ్ల నర్సింహ, ఎస్ఎంసి చైర్మన్ మాజీ జీడిమడ్ల దేవరాజు తమ అనుచరులతో శుక్రవారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సమర్థవంతంగా భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో కలిసికట్టుగా బేదాభిప్రాయాలు లేకుండా పనిచేయాలని కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలోకి చెరమన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నారబోయిన రవి ముదిరాజ్, మండల పార్టీ అధ్యక్షులు భీమనపల్లి సైదులు, నాయకులు పాలకూరి యాదయ్య, తాటికొండ సైదులు,అనంత లింగస్వామి, మాదగొని యాదయ్య,ఎరుకొండ అంజయ్య, శిరస్సు మల్లయ్య, రడం వెంకన్న, ఎరుకొండ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

### ఎంపీ అభ్యర్థి

# చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

### మండల ఇన్చార్జి కొలను రాజేందర్ రెడ్డి



మునుగోడు, మేజర్‌న్యూస్ : భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి అని పార్లమెంట్ ఎన్నికల మునుగోడు మండల ఇన్చార్జి కొలను రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాలలో కాంగ్రెస్ మండల సమన్వయ కమిటి ముఖ్య నాయకులతో కలిసి భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామాల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపు కోసం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలను ప్రతి ఒక్కరికీ వివరిస్తూ చామల కిరణ్ కుమార్ రెడ్డి చేయి గుర్తు మీద ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నారబోయిన రవి ముదిరాజ్ ,జిల్లా నాయకులు వేమిరెడ్డి జితేందర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బీమనపల్లి సైదులు,వైస్ ఎంపిపి అనంత స్వామి గౌడ్,మాజీ ఎంపీపీ పోలగోని సత్యం,సీనియర్ నాయకులు నన్నూరి విష్ణువర్ధన్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాల్వాయి చెన్నారెడ్డి,కొంపల్లి మాజీ సర్పంచ్ జాల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ పోగుల జానకి ప్రకాష్, సింగారం గ్రామ అద్యక్షులు కుంభం చెన్నారెడ్డి, జంగిలి నాగరాజు,నక్క వెంకన్న, సింగారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# భువనగిరి ఎంపీ అభ్యర్థిగా క్యామ మల్లేష్ గెలవడం ఖాయం

### మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి

తుంగతుర్తి, మేజర్‌న్యూస్ : వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో భువనగిరి ఎంపీ అభ్యర్థిగా బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి క్యామ మల్లేశం గెలవడం ఖాయమని మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సిరి ఫంక్షన్ హాలులో నిర్వహించిన భువనగిరి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడినారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, వానిని అమలు చేయడం సాధ్యం కాదని తెలిపినారు. కాంగ్రెస్ బిజెపి కుట్రలు ప్రజలకు అర్థమైందని వారిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. రేవంత్ మోడీలు కలిసి ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని కాంగ్రెస్ బిజెపి పార్టీలు రెండు ఒకటేనని అన్నారు. ప్రజల పక్షాన నిలబడింది ఒక కేసీఆర్ మాత్రమేనన్నారు. రాష్ట్రంలో 16 ఎంపీ నియోజక వర్గాలను బిఆర్ఎస్ పార్టీ కైవసం చూసుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్, జిల్లా పరిషత్ చైర్పర్సన్ దీపిక యుగంధర్ రావు, ఎలిమినేటి సందీప్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి క్యామ మల్లేశం, మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు తాటికొండ సీతయ్య, జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్, కార్మిక విభాగం గౌడ్‌చర్ల సత్యనారాయణ గౌడ్, శ్రీనివాస్, తదితర బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# విద్యుదాఘాతముతో గేదే మృతి



భూదాన్‌పోచంపల్లి, మేజర్‌న్యూస్ : భూధాన్‌పోచంపల్లి మండల పరిధిలోని కనుముక్కల గ్రామంలో శుక్రవారం సాయంత్రం మంటిపల్లి పెంటయ్యకు చెందిన పాడి గేదే కరెంటు షాక్‌తో మృతి చెందింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారము గ్రామ శివారు లోని వ్యవసాయ బావి వద్ద సాయంత్రం పశువులను మేపుతుండగా సమీపంలో కరెంటు వైర్ తెగి కింద పడి ఉన్నది. గమనించక కరెంటు వైర్ కు తాకడంతో ఒక గేదె అక్కడక్కడ మృతి చెందింది. దీని విలువ సుమారు లక్ష రూపాయల వరకు ఉంటుందని రైతు తెలిపాడు. ప్రభుత్వ పరిహారం చెల్లించి ఆదుకోవాల నివిజ్ఞప్తి చేశారు.

# ప్రేమించి పెళ్లి చేసుకున్న యువకుడి ఇంటి ముందు యువతి ధర్నా

### న్యాయం చేయాలంటూ రెండవ రోజు యువతి దీక్ష



భూదాన్‌పోచంపల్లి, మేజర్‌న్యూస్ : రెండేళ్లుగా ప్రేమించుకుని పెళ్లి చేసుకొని ఒక్కటవుదామని నమ్మబలికి పెళ్లి కూడ చేసుకొన్నాడు. అనంతరం కాపురానికి తీసుకెళ్లకుండా భర్త ముఖం చాటేయ్యడంతో యువతి తనకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులతో శుక్రవారం రెండవ రోజు అత్తారింటి గేటు ముందు కూర్చొని ధర్నా చేపట్టింది. ఈ సంఘటన మండలంలోని కప్రాయిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం వలిగొండ మండలం వెల్వర్తి గ్రామానికి చెందిన బోళ్ల నాగమణి(21) రెండేళ్ల క్రితం మండలంలోని జలాల్పు రంలోని స్వామిరామానందతీర్థ గ్రామీణ సంస్థలో కంప్యూటర్ కోర్సు నేర్చుకో వడానికి వచ్చింది. అదే సమయంలో మండలంలోని కప్రాయిపల్లి గ్రామానికి చెందిన గంగదేవి సాయి (22) కూడ ఇదే సంస్థలో స్వయం ఉపాధికోర్సు నేర్చు కోవడానికి వచ్చాడు. ఈ క్రమంలోవీరిద్దరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇలా రెండేళ్లు ప్రేమించుకొని ఒకరు నొకరు ఇష్టపడి ఈ ఏడాది జనవరి 21న తల్లిదండ్రులకు తెలియకుండా ఇంటి నుంచి వెళ్లిపోయి శ్రీశైలం పుణ్యక్షేత్రంలోని వీరభద్ర దేవాలయంలో పెళ్లి చేసుకొని ఒక్కటయ్యారు. దాంతో తన కుమార్తె కన్పించడంలేదని నాగమణి తండ్రి యాదగిరి జనవరి 22న చౌటుప్పల్ పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసుపెట్టారు. అనంతరం కుమార్తె ప్రేమ వివాహం చేసుకొన్నదని తెలుసుకొన్నారు. మరుసటి రోజు పెళ్లి చేసుకొన్న సాయి. నాగమణి చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌కు రాగా, వీరివురు మేజర్లు కావడంతో పోలీసులు ఇంటికి పంపించారు. అనంతరము రెండు రోజుల్లో తన కుమార్తెది ఎంగేజ్మెంట్ ఉందని, 2 నెలల తరువాత సాంప్రదాయకంగా పెళ్లి చేసి కాపురానికి తీసుకెళ్తామని గంగదేవి సాయి తండ్రి సత్యనారాయణ నాగమణి తల్లిదండ్రులకు నచ్చజెప్పాడు. అంతేకాక పెద్దల సమక్షంలో పత్రం కూడ రాసి ఇచ్చాడు. కాని రెండు నెలలు గడిచినా భర్త కాపురానికి తీసుకెళ్లడం లేదని, సత్యనారాయణ తన కుమార్తె ఎంగేజ్ మెంట్ అని అబద్దాలు చెప్పి మోసం చేశారని గ్రహించారు. దాంతో నాగమణి తన భర్త సాయికి ఫోన్ చేసినా స్పందన లేదు. చివరకు యువతి స్థానిక పోలీసుల సలహా మేరకు ఇటీవల భువనగిరి మహిళా పోలీస్ స్టేషన్ను ఆశ్రయించింది. దాంతో పోలీసులు ఇరువురికి పలుమార్లు కౌన్సిలింగ్ ఇచ్చారు. నీవు నాకు వద్దని, ఏమి చేసుకొంటావో చేసుకోమ్మని సాయి తెగేసి చెప్పడంతో ఇక గత్యంతరంలేక గురువారం నాగమణి, తన తల్లిదండ్రులతో కలిసి కప్రాయిపల్లి వచ్చింది. విషయం తెలిసి సాయి కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి పరారయ్యారు. ఆ యువతి ఉదయం నుంచి రాత్రి వరకు ఇంటి గేటు బయట కూర్చుని దీక్ష చేపట్టారు. అయితే తనకు న్యాయం జరిగే వరకు ఇక్కడే ఉంటానని నాగమణి కన్నీళ్ల పర్యాంతమైంది. పోలీసులు ,అధికారులు స్పందించి ఓ ఆడబిడ్డకు న్యాయం చేయాలని వేడుకొంటుంది. కాగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గ్రామానికి రాగా యువతి ఆమె కుటుంబ సభ్యులు తమకు తగిన న్యాయం చేయాలంటూ ఆయనకు గోడు వెళ్ళబోసుకున్నారు.

# కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం

(మొదటిపేజీ తరువాయి)

యూత్ కాంగ్రెస్ నాయకుడిగా 20 ఏళ్లుగా పార్టీ కోసం పని చేస్తున్న వ్యక్తిని అలాంటి వ్యక్తిని భువనగిరి ఎంపీ అభ్యర్థిగా అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత ఈ ప్రాంత ప్రజలదని ఈనెల 13న జరిగే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ చేయి గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. అనంతరము దేశ్ ముఖి గ్రామానికి చెందిన పలువురు ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు దుర్గం దేవేందర్, జక్కల దశరథ, దుర్గం సతీష్, చిల్లర వెంకటేష్, అర్వపల్లి బన్నీ, కనమోని లింగస్వామి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు సామ మధుసూదన్ రెడ్డి, కళ్లెం రాఘవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేష్, మండల పార్టీ అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్,జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు మర్రి నర్సింహారెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ మోహన్ రెడ్డి,రాజీవ్ పంచాయతీ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు గునిగంటి రమేష్ గౌడ్,పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్, మండల పార్టీ ఉపాధ్యక్షులు అని రెడ్డి జగన్ రెడ్డి ,కాసుల అంజయ్య ,చింతల శ్రీశైలం ,ప్రధాన కార్యదర్శి తోట శ్రీనివాస్, మాజీ పిఎసిఎస్ చైర్మన్ ఫకీరు మల్లారెడ్డి, మండల నాయకులు పకీరు నర్సిరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు నోముల మమతా బస్వారెడ్డి, నాయకులు దాసర్ల జంగయ్య, గుండాల రాజారాం,దుర్గం మచ్చేందర్, జక్కిలి శంకర్ యాదవ్, పడాల సతీష్ చారి, నాగభూషణం, బి రెడ్డి సందీప్ రెడ్డి, బాబు, బందెల ఆనంద్, ఇట్ట మోని మహేష్ యాదవ్, మక్తాల గోవర్ధన్, మోటే బాలు, దర్శన్ రెడ్డి, రావుల జంగయ్య, రావుల అనిల్, ఉప్పునూతల వెంకటేష్, రామ్ రెడ్డి, పానుగంటి లింగస్వామి, ఉడుతల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిప్పుల కొలిమి

రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారింది. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. నీళ్లు లేక జనం గొంతెండుతోంది. రోళ్లు పగులుతున్నాయి. భూపాలపల్లి జిల్లా చెల్పూరులో 50 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. ప్రజలు అతలాకుతలమవుతున్నారు. భద్రాద్రిలో భార్యభర్తలు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ఎండవేడిమిని తట్టుకోలేక సూర్యోద్రేకానికి భస్మీపటలమైంది. 1901 నుండి నేటి వరకు ఇంత ఘనం ఎండలు ఎప్పుడూ నమోదు కాలేదని వాతావరణ నివుణులు చెబుతున్నారు. సూర్యుడి ఉగ్రతాపానికి ఉష్ణోగ్రతలు పైకి ఎగబాకుతాయని వాతావరణ శాస్త్రవేత్తలు ముందే హెచ్చరించారు. అయినా పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. నల్లగొండ జిల్లాలో రైతు సమగ్ర సర్వేకు వెళ్లిన ఏఈఓ వడదెబ్బ తాకి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృాఎతిచెందాడు. పెద్దపల్లి జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్త విధులు ముగించుకుని వస్తుండగా వడగాలి తగిలి జ్వరంతో మరణించింది. పొలంలో మంటలు ఆర్పేందుకు వెళ్ళిన ఇద్దరు రైతులు సజీవదహనమయ్యారు. తెలుగురాష్ట్రాలలో రోజుకు సగుటున 20మందికి పైగా సూర్యతాపానికి బలవుతున్నారు. సాధారణం కన్నా 5 డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగితే వడగాలులుగా గుర్తిస్తారు. 40 డిగ్రీల ఉష్ణోగ్రత దాటితే ప్రజలు వడదెబ్బకు గురవుతారు. ఆరోగ్యశాఖ తెలిపిన వివరాల ప్రకారం రాష్ట్రంలో 6384 మందికి వడదెబ్బ తగిలినట్టు ప్రకటించారు. 171 మంది చనిపోయినట్టు ప్రకటించారు. ఈ లెక్కలు ప్రభుత్వ ఆస్పత్రిలో నమోదైనవి మాత్రమే. ఇంకా ప్రయివేటు ఆస్పత్రులలో లెక్కలు తీసుకుంటే ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉంది. గత నాలుగేండ్లలో వడదెబ్బకు దేశవ్యాపితంగా 4620 మంది చనిపోయారు. అందులో తెలుగు రాష్ట్రాల ప్రజలే 90శాతం పైగా ఉన్నారు. ఉమ్మడిరాష్ట్రంలో 4246 మంది వడదెబ్బకు చనిపోవడం ఆందోళన కలిగించింది. ఇందులో ఎక్కువమంది ఉపాధి కూలీలూ గొర్రెల కాపరులూ కావడం విచారకరం. ప్రభుత్వం ఉపాధి కార్మికులకు నీడ, నీళ్ళు ప్రాథమిక వైద్య సౌకర్యాల ఏర్పాటులో విఫలమైంది. ఫలితంగా పేదల మరణాలకు కారణమైంది. ఇప్పుడు తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా అందుకు భిన్నంగా ఏమీలేదు.

రోజూ వివిధ శాఖల పనితీరుపై తీరికలేకుండా సమీక్షలు జరువుతున్న పాలకులు వడదెబ్బ మరణాలపై ఎందుకు సమీక్ష జరపడం లేదో ఆలోచించుకోవాలి. ఉపాధి పనులు జరుగుతున్న ప్రతిచోటా కూలీలు వడదెబ్బకు గురికాకుండా రక్షణ చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ ఆస్పత్రులలో వడదెబ్బకు గురైన వారికి ఇచ్చేందుకు కనీసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా అందుబాటులో పెట్టలేదు. ప్రభుత్వం వడగాలుల నుండి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు చైతన్య కల్పించటం మరిచింది. మండే ఎండలకు ప్రాణనష్టమే కాదు ఆస్తినష్టం కూడా అధికంగానే జరుగుతున్నది. భూపాలపల్లిలో 20 గుడిసెలు, యాదగిరిగుట్టలో 75 గుడిసెలు అగ్నికి ఆహుతయ్యాయి. మంచిర్యాలలో షార్ట్ సర్క్యూట్‌తో వెయ్యి బస్తాల ధాన్యం కాలిపోయింది. ఆయా ప్రాంతాలలో అగ్నిమాపక కేంద్రాలు అందుబాటులో లేవు. కోట్లాది రూపాయలు అస్తినష్టం జరుగుతున్నది. ఇప్పటికీ అగ్ని ప్రమాదాలను అరికట్టడంలో ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవడం లేదు.

హైదరాబాద్ సమీపంలో ఉన్న షాద్‌నగర్‌లో ఈవేసవిలో ఒక్కొక్క కుటుంబం మంచినీటి కోసం నెలకు రూ.2,500 ఖర్చు చేస్తున్నారు. తాగునీటి కొరత పల్లెలను పట్టిపీడిస్తున్నది. ప్రత్యామ్నాయం చూడాల్సిన పాలకులు చేతులెత్తేశారు. ఎప్పుడో వచ్చే మిషన్ భగీరథకు పాలకులు ఊదరగొట్టి జనానికి ఎండమావుల్లో నీళ్ళు తాగిస్తున్నారు. గత ఏడాది ప్రయివేటు బావులకు ఇవ్వాల్సిన కోట్లాది రూపాయలు చెల్లించలేదు.

## జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలంటూ ముజీబ్‌హుస్సేనీకి ఉద్యోగుల విన్నపం



సిటీ బ్యూరో,మేజర్ న్యూస్ఃహైదరాబాద్ జిల్లాలో పనిచేస్తున్న వివిధ శాఖల ఉద్యోగులు ఏదుర్కొంటున్న పలు పెండింగ్ సమస్యలను పరిష్కరించాలంటూ పలువురు ఉద్యోగ సంఘాల నేతలు టి.ఎన్.జి.ఓ. యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎస్. ముజీబ్‌హుస్సేనినీకల్సి విన్నవించారు. సుమారు పది నెలలుగా పాసై పెండింగ్‌లో ఉన్న జి.పి.ఎఫ్. బకాయిలు, మెడికల్ రీయంబర్స్‌మెంట్,సరేండర్ లీవ్ ఏన్‌క్యాష్‌మెంట్ బకాయి నిధులు విడుదల కాకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురిఅవుతున్నామని వారు మొరపెట్టుకున్నారు. మే,జూన్ మాసంలో పిల్లలకు పుస్తకాలు, స్కూల్ డ్రెస్సులు,కాలేజీ అడ్మిషన్లు,ఇతర అత్యవసర పనులకి డబ్బులు ఎంతో అవసరం ఉన్నందున,రాష్ట్ర ప్రభుత్వం తక్షనమే నిధులను విడుదల చేయించేవిధంగా తగిన చొరవ తీసుకోవాలని వారు విన్నవించారు. అందుకు ఎస్.ముజీబ్‌హుస్సేనీ స్పందిస్తూ టి.ఎన్.జి.ఓ.యూనియన్‌పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి నమ్మకం ఉందని, ఉద్యోగులు ఏమాత్రం ఆధైర్యపడే అవసరం లేదని, సమస్యలు వెంటనే పరిష్కరించబడతాయని ఆయన తగిన హామీ ఇచ్చారు.

## జిఆర్ఎం ఓవర్సీస్ ప్రీమియం బాస్మతి బియ్యాన్ని ఒమన్‌కు సరఫరా చేయడానికి తొలి ప్రభుత్వ అనుమతిని పొందింది

సోమాజిగూడ/మేజర్ న్యూస్: జిఆర్ఎం ఓవర్సీస్ లిమిటెడ్ 4,500 ఎం.టి ప్రీమియం బాస్మతి బియ్యాన్ని సరఫరా చేయడానికి ఒమన్ సుల్తానేట్ వ్యవసాయ, మత్స్య సంపద జలవనరుల మంత్రిత్వ శాఖ నుండి తన మొదటి ఆర్డర్‌ను అందుకుంది, దీని విలువ 465 మిలియన్ రూపాయలు.ప్రభుత్వం అనుమతి ప్రాంతంలోని సంస్థలు జిఆర్ఎం ఓవర్సీస్‌కు 7,00,000 ఎం.టి బాస్మతి రైస్ యొక్క మొత్తం పరిమాణంతో గణనీయమైన లక్ష్య మార్కెట్‌ను తెరుస్తుంది.23లో భారతదేశం నుండి జరిగిన మొత్తం ఎగుమతుల్లో సింహభాగం 78% కలిగి ఉన్న బాస్మతి రైస్‌ను మేనా ప్రాంతం అతిపెద్ద దిగుమతిదారుగా కలిగి ఉంది, అయితే యూరప్ 6.9% మరియు అమెరికా+ కెనడా 6.6% (23) సహకారం అందించాయి. జి.అర్.ఎం ఓవర్సీస్ తన ఎగుమతి వ్యాపారంలో 95% మెనా ప్రాంతానికి మరియు మెనా ప్రాంతంలోని టాప్ 5 బాస్మతి రైస్ ఎగుమతిదారులలో ఒకటిగా స్థిరపడినందున, వ్యూహాత్మకంగా తన స్థానాన్ని నిలబెట్టుకుంది.మేనేజింగ్ డైరెక్టర్ మిస్టర్. అతుల్‌గార్గ్ ఇంకా ఇలా అన్నారు, భారత బాస్మతి బియ్యం యొక్క అతిపెద్ద వినియోగదారులలో ఒకటైన ఒమన్ సుల్తానేట్ నుండి ఈ తొలి ఆర్డర్‌ను అందుకున్నందుకు మేము సంతోషిస్తున్నాము. ఇది మా బాస్మతి బియ్యం నాణ్యతను మరియు పెరుగుతున్న డిమాండ్‌ను ఒమన్ గుర్తించడాన్ని సూచిస్తుంది. బాస్మతి బియ్యం యొక్క అతిపెద్ద వినియోగదారు ప్రాంతమైన మధ్యప్రాచ్యంలోని సాధారణ వ్యాపార అవకాశాలకు ఈ ఆర్డర్‌ను మేము ఒక గేట్‌వేగా చూస్తున్నామనీ అన్నారు.

## విధులను ఆటంకపరిచిన వ్యక్తులకు జైలు శిక్ష

హిమాయత్ నగర్ ,మేజర్ న్యూస్ : పోలీస్ అధికారుల విధులను ఆటంకపరచిన ఇద్దరు వ్యక్తులకు నాంపల్లి వి ఎస్పిఎల్ ఎంఎం కోర్టు మెజిస్ట్రేట్ సింగవరవు సత్యనారాయణ ఐదు రోజుల జైలు శిక్షను విధించారు. నారాయణగూడ స్టేషన్ అడ్మిన్ ఎస్ఐ నరేష్ కుమార్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్ పరిధిలో గురువారం రాత్ర పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీస్ అధికారులను తాగిన మైకంలో విధులను ఆటంక పరచడమే కాకుండా దురుసుగా ప్రవర్తించారని తెలిపారు. జాంబాగ్ కు చెందిన సాయి మారుతి (25), సాయి కృాఎష్ణ (34) లను శుక్రవారం కోర్టులో హాజరు పరచగా వివరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ వీరికి యు /ఎస్ 186 ,188, ఐపిసి 61 బి మరియు 70 ఏ సిపి యాక్ట్ కింద ఐదు రోజులు శిక్ష విధించారని వెల్లడించారు. విధినిర్వహణలో ఉన్న పోలీస్ అధికారుల పట్ల ఎవరైనా దురుసుగా ప్రవర్తించిన, విధులకు ఆటంకపరచిన నేరముగా పరిగణించాల్సి వస్తుందని ఇన్స్పెక్టర్ ఈ చంద్రశేఖర్ స్పష్టం చేశారు.

## అతూల్ కుమార్ అంజన్‌కు సిపిఐ నాయకుల ఘన నివాళి

అబ్దుల్లాపూర్‌మెట్, మేజర్‌న్యూస్ (మే 03) : ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి, సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యుడు అతూల్ కుమార్ అంజన్ మృతి చెందిన సందర్భంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండల సిపిఐ కార్యదర్శి ముత్యాల యాదిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రావినారాయణ రెడ్డి నగర్ కాలనీలో ఆయన చిత్ర పటానికి వివిద ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లుర్పించారు. ఈ సందర్భంగా యాదిరెడ్డి మాట్లాడుతూ అతూల్ కుమార్ అంజన్ సిపిఐ పార్టీలో కార్యకర్త స్థాయి నుంచి ఎదిగి జాతీయ కౌన్సిల్‌లో అనేక పదవులు చేపట్టారన్నారు. పార్టీలో అంతర్గత సమస్యలు వచ్చినప్పుడు సంస్థాగతమైన నిర్ణయాలు తీసుకోవడంలో సిద్దహస్తుడన్నారు. పార్టీకి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు.

# సీతాఫలమండిలో కేటీఆర్ రోడ్ షో



సీతాఫలమండి, మేజర్ న్యూస్: బీఆర్శ్రీస్ పార్టీ సికింద్రాబాద్ ఎం.పీ. అభ్యర్థి టి. పద్మారావు గౌడ్ గారికి మదద్తుగా సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని అడ్డగుట్ట, సీతాఫలమండి డివిజన్‌లలో జరిగిన రోడ్ షో లో పాల్గొని ప్రసంగించిన భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బి.ఆర్.ఎస్. పార్టీ ఎం.పి. అభ్యర్థి టి. పద్మారావు గౌడ్... ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్‌లు సామల హేమ, లింగాని లక్ష్మి ప్రసన్న, కంది శైలజ, రాసురి సునీత, బి.ఆర్.ఎస్. పార్టీ రాష్ట్ర యువజన విభాగం నాయకులు రామేశ్వర్ గౌడ్, త్రినేత్ర గౌడ్, కిషోర్ గౌడ్, కిరణ్ గౌడ్.. పెద్ద ఎత్తున కేటీఆర్, పద్మారావు గౌడ్‌లకు ఘన స్వాగతం పలికిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు..

ఎం.పి. అభ్యర్థి పద్మారావు గౌడ్ కామెంట్స్...

మా అన్న కేసీఆర్ నన్ను పిలిచి ఎం.పి.గా నిలబడు అని చెప్పి పంపిండు. అమిత్ షా, యోగి ఆదిత్యనాథ లాంటి వారు కార్పొరేటర్ ఎన్నికలప్పుడు వచ్చిన కూడా బిఆర్ఎస్ పార్టీకే పట్టం క ట్టింద్రు. నాడు గల్లీలో గెలిసినం, నేడు ఢిల్లీలో గెలుస్తాం. ప్రతి గడప గడపలోని అక్కచెల్లెలు, అన్నదమ్ములు నాకు బాగా తెలుసు. సికింద్రాబాద్‌లో లక్ష మెజారిటీతో గెలిచి చరిత్ర సృష్టించబోతున్నాం. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో 11 శాతం ముందంజలో ఉన్నాం.

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్‌ప్రెసిడెంట్ కామెంట్స్..

2014లో బడే భాయ్ మోడీ మస్త్ కథలు చెప్పిండు. రూ.15 లక్షలు, ప్రతి ఒక్కరి కి ఇళ్ళు, ప్రతి ఇంటికి నల్లా, రైతుల ఆదాయం డబుల్ అని పెద్ద పెద్ద బిల్డప్‌లు ఇచ్చిండు. హైదరాబాద్‌లో వరదలు వస్తే రూపాయి ఇయ్యలే. మెట్రోకు పైసా ఇయ్యలే. కానీ గుజరాత్‌లో వరదలు వస్తే మాత్రం మోడీ ప్రత్యేక విమానం వేసుకొని పోయి వెయ్యికోట్లు ఇచ్చిండు. గుజరాత్ వాళ్లే ప్రజలా? హైదరాబాద్ వాళ్లు ప్రజలు కాదా? అడ్డగుట్టకు, సీతాఫలమండి డివిజన్, సికింద్రాబాద్‌కు ఏం చేసినవో చెప్పి ఓటు అడిగే దమ్ముందా కిషన్ రెడ్డికి. సిగ్గు లేకుంవడా ఐఐటీలు ఇచ్చినమని చెప్పుకుంటున్నారు. ఒక్క స్కూల్ కూడా ఇయ్యలేదు. ఈ ప్రధాని మోడీ పప్పు, ఉప్పు, చింతపండు అన్ని పిరం చేసిన పిరమైన ప్రధాని. నేను చెప్పింది అబద్దమని కిషన్ రెడ్డి నిరూపిస్తే నా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. ఈసారి సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యుడు కావాలె. హైదరాబాద్‌లో మీరు మాకు ఎక్కువ సీట్లు ఇచ్చారు. అందుకు మీకు రుణపడి ఉంటాం. జిల్లాలో ఉన్నవారే మోసపోయారని మీరు బాధపడుతున్నారు. బడేభాయ్ బడా మోసం. రేవంత్ రెడ్డిది కూడా బడా మోసమే. బస్సు ఫ్రీ, మహిళలకు రూ.2500, వృద్ధులకు 4వేలు, తులం బంగారం, స్కూటీలు ఇస్తా అన్నాడు. రేవంత్ రెడ్డి చెప్పిన వాటిలో ఒక్కటైనా వచ్చిందా? కాంగ్రెస్ వస్తే మంచి కాదని ముందే చెప్పినం. వాళ్ల కాళ్లు మంచివి కావు. కాంగ్రెస్ వచ్చింది రాష్ట్రంలో కరెంట్, నీటి కష్టాలు మొదలైనయ్. కేసీఆర్ సీఎం కాలేదని మీరు బాధపడుతున్నారు కదా?.. 10-12 సీట్లు మీచరు మాకిస్తే మళ్లీ రాష్ట్ర రాజకీయాలను కేసీఆర్ శాసిస్తారు. 2014, 2019 లో బీజేపీని రాష్ట్రంలో ఓడించింది బీఆర్ఎస్ మాత్రమే. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీజేపీ తీస్‌మార్ ఖాన్లను ఓడించింది కూడా బీఆర్ఎస్ మాత్రమే. ఒక్కటే ఓటుతో అటు బడాభాయ్, చోట భాయ్ కు బుద్ధి చెప్పాలె. కేసీఆర్ గారికి తమ్ముడి లాంటి నేత పద్మారావు గౌడ్. ఎన్ని కష్టాలు వచ్చినా సరే పద్మారావు గౌడ్ గారు కేసీఆర్‌తోనే ఉన్నారు. ఒక్క సికింద్రాబాద్ నుంచే పజ్జన్నకు 60 వేల మెజార్టీ ఇవ్వాలే..

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని మళ్లీ గెలిపించాలి : జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి

సీతాఫలమండి, మేజర్ న్యూస్: దేశంలో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. నీతి నిజాయితీతో కూడిన పాలన కావాలని తిరిగి నరేంద్రమోడీని ప్రధాన మంత్రి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారని జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. కాంగ్రెస్ టీఆర్ఎస్ పార్టీలకు ఎన్నికల బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సి. కే. శంకర్ గారు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, కనకట్ల హరి, అంబాల రాజేశ్వరరావు, లావణ్య, ఎస్ ఆనంద్, కిట్టు పాల్గొన్నారు.



## ఎల్ కె పి సెక్యూరిటీస్ లిమిటెడ్ 24 ఆర్ధిక సంవత్సరంలో అత్యుత్తమ ఫలితాలను సాధించింది

LKP Securities Limited

సోమాజిగూడ/మేజర్ న్యూస్: ప్రముఖ ఆర్థిక సేవల ప్రదాత ఎల్ కె పి సెక్యూరిటీస్ లిమిటెడ్ 24 త్రైమాసిక మరియు 24 లో అత్యుత్తమ ఫలితాలను సాధించింది అని సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. 31 మార్చి, 2024తో ముగిసిన త్రైమాసికంలో (కన్సాలిడేటెడ్) కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం రూ. 3278 లక్షలు, 34.20% శాతం తో వృాఎద్ధి నీ పొందినట్లు పేర్కొన్నారు.31 మార్చి, 2024తో ముగిసిన సంవత్సరానికి (కన్సాలిడేటెడ్), కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం రూ. 9735 లక్షలు, సంవత్సరానికి 23.32% పెరుగుదల సాధించిందని పేర్కొన్నారు. ఎల్.కే.పి సెక్యూరిటీస్, 1948 నుండి విశిష్ట ఆర్థిక సేవల ప్రదాత, విశ్వాసం, పెట్టుబడి మరియు వృాఎద్ధి విజయవంతమైన సంపద సృాఎష్టికి మూలాధార సూత్రాలు అనే నమ్మకంపై స్థిరంగా ఉంది. దాని క్లయింట్‌ల శ్రేయస్సు కోసం అంకితం చేయబడింది, ఇది అనుభవం లేని వ్యక్తులు లేదా అనుభవజ్ఞులైన వారి ఆర్థిక లక్ష్యాల వైపు ఖాతాదారులను ముందుకు తీసుకెళ్లడానికి రూపొందించిన అనుకూల పెట్టుబడి పరిష్కారాలను అందిస్తుంది.అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలను ఏకీకృాఎతం చేయడం ద్వారా మరియు కొనసాగుతున్న పరిశోధన మరియు అభివృాఎద్ధిలో పెట్టుబడి పెట్టడం ద్వారా, ఎల్.కే.పి సెక్యూరిటీస్ ఆర్థిక రంగంలో అగ్రగామి వురోగతికి కట్టుబడి ఉంది. మార్కెట్ అభివృాఎద్ధి చెందుతున్నప్పుడు, పోటీగా ఉండటానికి కంపెనీ తన సేవలు మరియు సమర్పణలను నిరంతరం మెరుగుపరుస్తుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

## కమలాపురి కాలనీలోని స్టోన్ క్రాఫ్ట్ ఎదురుగ ఫుట్ పాత్ ఆక్రమించి నిర్మాణంపై ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌కి ఫిర్యాదు



సోమాజిగూడ/మేజర్ న్యూస్: కమలాపురి కాలనీలోని స్టోన్ క్రాఫ్ట్ షాప్ ఎదురుగ ఉన్న ఫుట్ పాత్ ను ఆక్రమించి పంక్చర్ షాప్ మరియు ఇంకో షాప్ నిర్మించడం జరిగిందనీ , మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే ఇలాంటి ఆక్రమణలు జరుగుతున్నాయని స్థానికులు అగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఆక్రమణ దారుల వద్ద ఎలాంటి డాకుమెంట్స్ లేకుండానే ఫుట్ పాత్ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపట్టారనీ , అదికారులు ఇలాంటి వారి పట్ల కఠినంగా వ్యవహరించి అక్రమంగా నిర్మించిన నిర్మాణాల ను వెంటనే తొలగించాలని స్థానికంగా వుంటున్న టి. శ్రీనివాస్ అనే వ్యక్తి ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ కి శుక్రవారం పిర్యాదు చేసినట్లు తెలిపారు. మీడియా ప్రతినిధుల తో అయన మాట్లాడుతూ ఏటువంటి టైల్స్ షాప్ డాక్యుమెంట్ ప్రకారం ఇది 60 మరియు 15 రోడ్ ఉండాలి కానీ పక్కన ఉన్న ఫుట్ పాత్ ఆక్రమించి షాపులు పెట్టి అక్రమ వ్యాపారం చేస్తూ స్థానికులను బెదిరిస్తున్నారనీ ప్రశ్నించారు . ఈ ఫుట్ పాత్ పైన ఉన్నటువంటి అక్రమ నిర్మాణాన్ని తొలగించి ట్రాఫిక్కు ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారుల దేనని అన్నారు.ఎలాంటి స్థల నిర్మాణ పత్రాలు లేకున్నా ఇదేంటనీ అడిగిన వారిని మా వద్ద రిజిస్ట్రేషన్ డాకుమెంట్స్ ఉన్నాయి అని , డాకుమెంట్స్ చూపించమని అడిగిన వాళ్ళను నీ అంతు చూస్తామని బెదిరిస్తూన్నారనీ వాపోయారు.కమిషనర్ వెంటనే సదరు ఆక్రమణదారుల యొక్క డాకుమెంట్స్ చెక్ చేసి వారు ఆక్రమించిన ఫుట్ పాత్ను కాళీచేయించి స్థానికులకు కలుగుతున్న అసౌకర్యాన్ని దూరం చేయాలని పిర్యాదు లో పేర్కొన్నట్లు తెలిపారు

# దేశంలో కార్మికుల హక్కుల పరిరక్షణ ఐ.ఎన్.టి.యు.సితోనే సాధ్యం

- కార్మికవర్గమంతా కాంగ్రెస్ పార్టీనే గెలిపించాలి - కాంగ్రెస్ పాలనా ఉంటేనే కార్మికుల జీవనోపాధికి భద్రత

- ఘనంగా ఐ ఎన్ టి యు సి 77వ వ్యవస్థాపక దినోత్సవాలు - ముఖ్యఅతిథి ఐ.ఎన్.టి.యు.సి జాతీయ అధ్యక్షులు అంబటి కృష్ణ మూర్తి హాజరు



హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ :దేశంలో కార్మికుల హక్కులను పరిరక్షించడంలో ఐ.ఎన్.టి.యు.సి యే నేటికీ కీలక పాత్ర పోషిస్తుందని ఐ.ఎన్.టి.యు.సి జాతీయ అధ్యక్షులు అంబటి కృాఎష్ణ మూర్తి తెలిపారు. దేశ స్వాతంత్రం అనంతరం కేంద్రంలోని కాంగ్రెస్ పాలనలో కార్మిక చట్టాలు, కనీస వేతనాలు, సామాజిక భద్రత మరియు కార్మికుల భద్రత, పారిశ్రామిక వివాదాల చట్టం, కార్మిక సంఘాల చట్టం మరియు కనీస వేతనాల చట్టం వంటి కార్మికుల రక్షణకు సంబంధించిన చట్టాలను రూపొందించడంలో ఐ.ఎన్.టి.యు.సి కీలక పాత్ర పోషించిందని అయన గుర్తు చేసారు. కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ హయాంలో అనేక పోరాటాలు చేసి కార్మికుల సంక్షేమం కోసం 44 కార్మిక చట్టాలను తీసుకవచ్చి ఐ.ఎన్.టి.యు.సి అమలు చేయించిందని, 2014 ఏర్పడ్డ నిరంకుశ మోదీ ప్రభుత్వం ఈ 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 కోడ్ లను తీసుకవచ్చి కార్మికుల హక్కులను, సంక్షేమాన్ని పూర్తిగా హరించివేసిందని అయన మండిపడ్డారు. బషీర్ బాగ్, దేశోద్ధారక భవన్ లో శుక్రవారం ఐ.ఎన్.టి.యు.సి తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఐ.ఎన్.టి.యు.సి 77 వ వ్యవస్థాపక దినోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ వ్యవస్థాపక ఉత్సవాల సభకు ఐ.ఎన్.టి.యు.సి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడా ఐలయ్య గౌడ్ స్వాగతం పలుకగా అధ్యక్షులు గుంజ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. అంబటి కృాఎష్ణ మూర్తి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ... నేడు మోదీ ప్రభుత్వ పాలనలో శ్రామికవర్గంపై ప్రమాదకరమైన దాడులు జరుగుతున్నాయని వాపోయారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, ఉద్యోగులందరినీ ఐక్యం చేసేందుకు, అవగాహన కల్పించేందుకు ఇలాంటి వేదికలను ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేసారు. పెరిగిన పని భారానికి వ్యతిరేకంగా,మెరుగైన వేతనాలు, పని పరిస్థితుల కోసం,సామాజిక భద్రత, మరియు ట్రేడ్ యూనియన్ హక్కుల కోసం రానున్న కాలంలో పోరాటాలు తీవ్రతరం చేయాలనీ పిలువునిచ్చారు. కార్మికుల సంక్షేమంలో లోతుగా పాతుకుపోయిన ఐ.ఎన్.టి.యు.సి దేశంలోని శ్రామిక వర్గ ఆకాంక్షలను సాకారం చేసేందుకు అంకితమైన సంస్థ అని పేర్కొన్నారు. ఐ.ఎన్.టి.యు.సి సూచనలు, సలహాలతో కేంద్రంలోని గత కాంగ్రెస్ ప్రభుత్వాలు నవరత్న కంపెనీ లతోపాటు అనేక ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పాటు చేసి లక్షలాదిమందికి ఉద్యోగావకాశాలు కల్పించిందని, నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు హోల్ సేల్ గా అమ్ముకుంటూ ప్రజలకు ఉద్యోగావకాశాలు లేకుండా చేస్తుందని మండిపడ్డారు. రోజురోజుకు పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, అధిక ధరలను అదుపు చేయకుండా ప్రధాని మోదీ మత విద్వేషాలు రెచ్చగొడుతూ లోక్ సభ ఎన్నికల్లో అడ్డగోలుగా గెలిచేందుకు దేశ యాత్ర చేస్తున్నాడని దుయ్యబట్టారు. కార్మిక, కర్షక, మహిళా, యువత, విద్యార్థి వ్యతరేక విధానాలకు పాల్పడుతున్న బీజేపీ ను ఈ లోక్ సభ ఎన్నికల్లో ఓడించి తగిన బుద్ధి చెప్పాలని అయన కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిన కార్మిక చట్టాల పునరుద్ధరణ కోసం బలమైన ఉద్యమాలు నిర్వహించి తిరిగి కార్మిక హక్కులను సాధించుకోవాలని అంబటి కృాఎష్ణమూర్తి పిలువునిచ్చారు. కాంగ్రెస్ ను గెలిపించి కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ను ప్రధాని చేయడానికి కార్మికవర్గమంతా కృాఎషి చేయాలనీ అంబటి కృాఎష్ణ మూర్తి విజ్ఞప్తి చేసారు. గుంజ శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికుల జీవితాలను మెరుగుపరిచేందుకు జరిగిన పోరాటాలలో ఐ.ఎన్.టి.యు.సి కీలక పాత్ర పోషించిందని గుర్తు చేసారు. ఐ.ఎన్.టి.యు.సి కష్టపడి సంపాదించిన కార్మిక చట్టాలు మోడీ ప్రభుత్వంలో కోల్పోయాయని ఆవేదన వ్యక్తం చేసారు. కార్మిక చట్టాలను క్రోడీకరించే పేరుతో కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా కార్మికుల హక్కులను తగ్గించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వ ప్రజా మరియు కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని గుంజ శ్రీనివాస్ హెచ్చరించారు. గూడా ఐలయ్య గౌడ్ మాట్లాడుతూ మోడీ నేతృాఎత్వంలోని పదేళ్ల బిజెపి ప్రభుత్వం కార్మికుల జీవనోపాధి మరియు పని పరిస్థితులపై కనికరంలేని దాడిని చేసిందని, కార్మికులు కష్టపడి సాధించుకున్న హక్కులను కాలరాసి, బడా కార్పొరేట్ల కు హద్దులేని దోపిడీని సులభతరం చేసేందుకు గత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన 44 కార్మిక చట్టాలను రద్దు చేసిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాల వల్ల కేంద్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో శాశ్వత ఉపాధి గణనీయంగా తగ్గిపోయిందని అన్నారు. కార్పొరేట్ లకు ఊడిగం చేస్తూ దేశ ప్రజలకు ఉద్యోగ, ఉపాద అవకాశాలు లేకుండా చేస్తున్న బీజేపీ ను ఈ లోక్ సభ ఎన్నికల్లో చిత్తుగా ఓడించి తరిమికొట్టాలని గూడా ఐలయ్య గౌడ్ పిలువునిచ్చారు. ఈ సభలో ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర ఉపాధ్యక్షులు సతీష్ బాబు వందన సమర్పణ చేయగా దళిత సంక్షేమ సంఘం అధ్యక్షులు ఏ.వి. జేమ్స్, గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాంద్ పాషా, ఐ.ఎన్.టి.యు.సి జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి నడిమిటి నాగ రాజు, నేతలు ఏ, రమేష్ యాదవ్, వి. అనిల్ రెడ్డి, జి. భాస్కర్, సి. గురు ప్రసాద్ రావు, ఏం. కృాఎష్ణ రెడ్డి మహిళా నాయకురాలు నాగమణి పాల్గొన్నారు.

# ఇండియామార్ట్ ఇంటర్‌మెష్ లిమిటెడ్ - నాలుగవ త్రైమాసికం ముగింపు



హైదరాబాద్, మేజర్ న్యూస్: ఇండియామార్ట్ ఇంటర్‌మెష్ లిమిటెడ్ (ఇండియామార్ట్ గా లేదా కంపెనీగాసూచించబడిన),మార్చి 31,2024 తో ముగిసే పూర్తి సంవత్సరం నాలుగవ త్రైమాసికం కోసం తమ ఆర్థిక ఫలితాలను శుక్రవారం ప్రకటించింది. ఈ సందర్భంగా ఈ సామర్థ్యంపై వ్యాఖ్యానిస్తూ,ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దినేష్ అగర్వాల్ ఇలా అన్నారు. ఆదాయం, డిఫర్డ్ రెవిన్యూ, లాభాలు నగదు ప్రవాహాల్లో స్థిరమైన వృాఎద్ధితో మేము ఆర్థిక సంవత్సరాన్ని ముగించాము .గొప్ప ఉత్పత్తి మరియు కస్టమర్ అనుభవాన్ని వారికి కేటాయించడం ద్వారా ఆన్‌లైన్ లో వృాఎద్ధి చెందడానికి మరిన్ని వ్యాపారాలను ఆరంభించడంపై మా దృాఎష్టి కేంద్రీకరించబడిందని తెలిపారు .కార్యకలాపాల నుండి శక్తివంతమైన నగదు ప్రవాహం మా విలువ ప్రతిపాదనను మరింత శక్తివంతం చేయడంలో నిరంతర పెట్టుబడుల నేపథ్యంలో,వ్యాపారాల మధ్య పెరుగుతున్న ఇంటర్‌నెట్ అనుసరణలో స్థిరమైన లాభదాయక మైన వృాఎద్ధిని మేము నమ్ముతున్నాం అన్నారు. ఎఫ్‌వై2024 వెర్సెస్ ఎఫ్‌వై2023 రూ.1,197 కోట్ల కార్యకలాపాలు నుండి మొత్తం ఆదాయం, వైఓవై వృాఎద్ధి 21%, ఈబీఐటీడీఏ లాభం 29%కి ప్రాతినిధ్యంవహించే రూ. 334 కోట్లకి స్వతంత్ర ఈబీఐటీడీఏ కార్యకలాపాలు నుండి ఉత్పన్నమైన మొత్తం నగదు రూ. 559 కోట్లు. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ప్రతి షేర్ కు రూ.20 ఆర్థిక డివిడెండ్ ను సిఫారసు చేశారు.క్యూ4 ఎఫ్‌వై2024 వెర్సెస్ క్యూ4 ఎఫ్‌వై2023 ఈరూ.315 కోట్ల కార్యకలాపాలు నుండి మొత్తం ఆదాయం, వైఓవై వృాఎద్ధి 17%, ఈబీఐటీడీఏ లాభం 30%కి ప్రాతినిధ్యంవహించే రూ. 90 కోట్లకి స్వతంత్ర ఈబీఐటీడీఏ కార్యకలాపాలు నుండి ఉత్పన్నమైన మొత్తం నగదు రూ. 260 కోట్లు.మొత్తం ఆర్థికపరైన ప్రధానాంశాలు (క్యూ4 ఎఫ్‌వై2024): ఇండియామార్ట్ కార్యకలాపాల ద్వారా మొత్తం ఆదాయాన్ని రూ. 315 కోట్లతో పోల్చినప్పుడు గత ఏడాది ఇదే త్రైమాసికం సమయంలో రూ. 269 కోట్లకు ఉంది, ఇది 17% వృాఎద్ధిని సూచిస్తోంది. దీనిలో ఇండియామార్ట్ స్వతంత్ర ఆదాయం రూ. 299 కోట్లు బిజీ ఇన్ఫోటెక్ ఆదాయం రూ. 14 కోట్లు ఉంది, ఇది వైఓవై ఆధారంగా వరుసగా 17%, 24% వృాఎద్ధిని నమోదు చేస్తోంది. కస్టమర్ నుండి కలక్షన్స్ 16% వృాఎద్ధి చెంది, త్రైమాసికానికి రూ. 484 కోట్లకు పెరిగాయి, ప్రాథమికంగా స్వతంత్ర కలక్షన్స్ రూ. 465 కోట్లు మరియు బిజీ ఇన్ఫోటెక్ కలక్షన్స్ రూ. 18 కోట్లు 16%, 24% వృాఎద్ధిని వరుసగా సూచిస్తున్నాయి. మార్చి 31, 2024న డిఫర్డ్ రెవిన్యూ రూ.1440కి పెరిగింది, ఇది 24% వైఓవై వృాఎద్ధిని సూచిస్తోంది. దీనిలో ప్రాథమికంగా ఇండియామార్ట్ స్టాండ్అలోన్ డిఫర్డ్ రెవిన్యూ రూ.1395 కోట్లు, బిజీ ఇన్ఫోటెక్ డిఫర్డ్ రెవిన్యూ రూ.43 కోట్లు ఉన్నాయి. వైఓవై ఆధారంగా వరుస గా 23%, 59% వృాఎద్ధిని నమోదు చేస్తున్నాయి.త్రైమాసికంలో మొత్తం లాభం రూ. 100 కోట్లు. ఇది 25% లాభాన్ని సూచిస్తోంది. త్రైమాసికం కోసం కార్యకలాపాల నుండి నగదు ప్రవాహం రూ. 260 కోట్లు. నగదు పెట్టుబడుల బ్యాలెన్స్ మార్చి 31, 2024 నాటికి రూ. 2,340 కోట్లుగా నిలిచింది. స్టాండ్అలోన్ ఫైనాన్షియల్ ప్రధానాంశాలు (క్యూ4 ఎఫ్‌వై2024): గత ఏడాది సమయంలో రూ. 256 కోట్లతో పోల్చినప్పుడు కార్యకలాపాల నుండి స్టాండ్అలోన్ ఆదాయం రూ.299 కోట్లకు పెరిగింది. ఇది 17% వృాఎద్ధిని సూచిస్తోంది. వృాఎద్ధి సప్లైయర్స్ కు చెల్లించడం నుండి పొందడంలో మెరుగుదల ద్వారా చెల్లింపు సప్లైయర్స్ సంఖ్యలో 6% పెరుగుదల ద్వారా ప్రాథమికంగా 10% ద్వారా ప్రోత్సహించబడింది. కస్టమర్ నుండి కలక్షన్స్ త్రైమాసికం కోసం రూ. 465 కోట్లకు మరియు డిఫర్డ్ రెవిన్యూ మార్చి 31, 2024 నాటికి రూ.1,395 కోట్లకు పెరిగి వైఓవై వృాఎద్ధి 23% సూచిస్తున్నాయి. త్రైమాసికం కోసం ఈ బిఐటిడిఏ రూ. 90 కోట్లుగా ఉండి లాభం 30% ని సూచిస్తోంది. త్రైమాసికానికి మొత్తం లాభం రూ. 92 కోట్లుగా ఉండి 27% లాభాన్ని సూచిస్తోంది. కార్యకలాపాల ప్రధానాంశాలు:(క్యూ 4 ఎఫ్‌వై 2024): ఇండియామార్ట్ క్యూ4 ఎఫ్‌వై24 లో 24 మిలియన్స్ విలక్షణమైన వ్యాపార సందేహాలను నమోదు చేసింది,ఇది 14% వైఓవై వృాఎద్ధిని సూచిస్తోంది. సప్లైయర్ స్టోర్ ఫ్రంట్ 7.9 మిలియన్ కు పెరిగింది,ఇది 5% వైఓవై యొక్క పెంపుదల చెల్లింపు సప్లైయర్స్ 214 వేలకు పెరిగారు,ఇది త్రైమాసికం సమయంలో 3 వేల సబ్‌స్క్రైబర్స్ యొక్క మొత్తం చేరికను సూచిస్తోంది.

# ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కరోల్ ఫుర్టాడో




హైదరాబాద్, మేజర్ న్యూస్: ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఈ ఏడాది మే 1 నుండి అమల్లోకి వచ్చేలా మూడు సంవత్సరాల పాటు బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కరోల్ ఫుర్టాడో నియమితులైనట్లు ప్రకటించింది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ కరోల్ ఫుర్టాడో నియామకాన్ని ఆమోదించింది. బ్యాంక్ తదుపరి 8వ ఎ జి ఏం బ్యాంక్ తన వాటాదారుల ఆమోదాన్ని కోరుతుంది. ఫుర్టాడో బ్యాంక్ ప్రారంభం ఉన్నారు. చీఫ్ హ్యూమన్ రిసోర్స్ ఆఫీసర్, హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ అండ్ సర్వీస్ క్వాలిటీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్స్ సిబిఓ తో సహా పలు కీలక పదవులను చేపట్టారు. ఏం ఎస్ ఫుర్టాడో ప్రముఖ వ్యాపారం, బ్యాంకింగ్ కార్యకలాపాలు, క్రెడిట్, అనుభవంతో వస్తుంది. ఉజ్జీవన్‌కు నిర్మించిన నాయకత్వ బృాఎందంలో ఆమె కీలక సభ్యురాలు. -ఏం ఎఫ్ ఐ నుండి స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌గా సంస్థ యొక్క పరివర్తనలో ఆమె కీలక పాత్ర పోషించారు. ఉజ్జీవన్‌ను పని చేయడానికి ఒక గొప్ప ప్రదేశంగా గుర్తించడంలో కీలక పాత్ర పోషించారు. ఆమె గతంలో ఏ యెన్ జెడ్ బ్యాంక్ మస్కట్ సెంచూరియన్ బ్యాంక్ లిమిటెడ్‌తో కలిసి బాధ్యతలు నిర్వహించారు . 2009లో, కరోల్ ఆమె ప్రదర్శించిన వృాఎత్తిపరమైన నిబద్ధతకు గుర్తింపుగా ఉమెన్స్ వరల్డ్ బ్యాంకింగ్ ద్వారా ఫైనాన్షియల్ ఉమెన్స్ అసోసియేషన్ అవార్డును అందుకున్నారు. ఆమె మౌంట్ కార్మెల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, బెంగుళూరు నుండి పోస్ట్ గ్రాడ్యుయేట్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అహ్మదాబాద్, హార్వర్డ్ బిజినెస్ స్కూల్, బోస్టన్ నిర్వహిస్తున్న వ్యూహాత్మక నాయకత్వ కార్యక్రమాలలోపాలు పంచుకున్నారు

## వేతన సవరణలో నాలుగో తరగతి ఉద్యోగులకు న్యాయం చేయాలి



హిమాయత్ నగర్ , మేజర్ న్యూస్ :వేతన సవరణలో నాలుగో తరగతి ఉద్యోగులకు న్యాయం చేయాలని తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం ప్రతినిధులు రాష్ట్ర వేతన సవరణ సంఘంకు విన్నవించింది. పెరిగిన ధరలు, జీవన వ్యయం దృాఎష్టిలో పెట్టుకుని నాలుగో తరగతి ఉద్యోగులకు కనీస వేతనం రూ.35 వేలు ఉండేటట్లు చూడాలని, 51 శాతం ఫిట్ మెంట్ ప్రకటించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ తదితరుల నేతృాఎత్వంలోని ప్రతినిధి బృాఎందం శుక్రవారం రాష్ట్ర వేతన సవరణ సంఘం చైర్మన్ ఎన్.శివశంకర్ ను కలిసి నాలుగో తరగతి ఉద్యోగుల ప్రతిపాదనలు అందచేశారు. అనంతరం గడ్డం జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్ లు మాట్లాడుతూ పలు ప్రభుత్వ శాఖల్లో పార్ట్ టైం, డైలీ వేజెస్, ఎన్ఎంఆర్ లుగా 30 ఏళ్లుగా పని చేస్తున్నప్పటికీ తక్కువ వేతనం ఇస్తున్నారని, దీని దృాఎష్ట్యా కనీస వేతనం 35 వేల రూపాయలు ఇవ్వాలని కోరారు. 10 ఏళ్లుగా యూనిఫాం ఇవ్వడం లేదన్నారు. ఇప్పుడు 5 ఇంక్రిమెంట్లు ఇస్తున్నారని, వీటిని ఏడుకు పెంచాలని చెప్పారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కొంగర కలాన్ కు మారడం వల్ల కేవలం 15 శాతం హెచ్ఆర్ఏ ఇస్తున్నారని, కొత్త పీఆర్సీ లో 30 శాతం హెచ్ఆర్ఏ ఇవ్వాలని కోరారు. అటవీ, సహకార, పంచాయతీరాజ్, నీటి పారుదల, జూపార్క్ లలో పని చేసే నాలుగో తరగతి ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఈ సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృాఎష్టికి తీసుకెళ్తామని వివరించారు. తమ ప్రతిపాదనల పట్ల పీఆర్సీ కమిటీ చైర్మన్ శివశంకర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖాదర్ బిన్ హుస్సేన్, పి.రాజేందర్, కృాఎష్ణవేణి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## కిషన్‌రెడ్డి గెలుపుకోసం బీజేపీ కార్నర్ మీటింగ్...



ముషీరాబాద్,మేజర్‌న్యూస్ : గాంధీనగర్ డివిజన్‌లో బీజేపీ కార్నర్ మీటింగ్‌నిర్వహించింది. బీజేపీ కార్యకర్తలు, నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గాంధీనగర్ కార్పొరేటర్ ఏ.పావని వినయ్ కుమార్ మాట్లాడుతూ సికింద్రాబాద్ లోక్‌సభనియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి గెలుపును ఎవ్వరూ ఆపలేరని పేర్కొన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో అన్ని డివిజన్లలో బీజేపీ కార్పొరేటర్లే ఉన్నారని, ముషీరాబాద్‌నుండి బీజేపీకి భారీ మెజారిటీని బీజేపీ సాధిస్తుందని,గాంధీనగర్ డివిజన్ ప్రజలు బీజేపీ వెంటే ఉన్నారని పావని వినయ్‌కుమార్ పేర్కొన్నారు.

# గడప గడపకు బిజెపి నల్గొండ ప్రచారం చేస్తున్న రామరాజు యాదవ్



నల్లగొండ టౌన్, మేజర్‌న్యూస్ : లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా నల్లగొండ పట్టణంలోని 20, 42వ వార్డు పెద్దబండ, అంబేద్కర్ కాలనీ, ఎఫ్‌సిఐ కాలనీ, ఓం సాయి కాలనీ, గొల్లగూడ పరిధిలో నరేంద్ర మోడీ మూడవ సారి కూడా అధికారంలోకి కావాలని గత 10 ఏళ్లలో చేపట్టిన సంక్షేమ పథకాలను గడప గడప తెలియజేసి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా పిల్లి రామరాజు యాదవ్ మాట్లాడుతూ దేశ ప్రజలందరూ బాగుండాలంటే మోడీకి ఓటేయాలని అన్నారు. దేశంలో 400 సీట్లతో మోడీ అధికారంలోకి రానున్నట్లు వ్యక్తం చేశారు. అందులో నల్లగొండ పార్లమెంట్‌లో బలపరిచిన అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి కూడా భారీ మెజార్టీతో గెలుపొందపోతున్నారు అని తెలియజేశారు. నల్లగొండ జిల్లాలో కుటుంబ రాజకీయ పాలనను అరికట్టడానికి నల్లగొండ ప్రజలందరూ ఎదురుస్తున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు బత్తుల నరేష్, ఉప్పు రామకృష్ణ, కోఆర్డినేటర్స్ కమ్మంపాటి అజయ్, నాంపల్లి అయ్యప్ప, జక్కల సత్తయ్య మహిళా నాయకురాలు బుడిగే ఝాన్సీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు బుడిగే మల్లేష్ నాంపల్లి శేఖర్, నాంపల్లి రమేష్, కి.సాయి, జక్కల విజయ్,కొత్తపల్లి సైదులు, కత్తుల నరసింహ, సముద్రాల శ్రీకాంత్, సంతోష్, జానయ్య, జక్కల గంగరాజు, పొలం ఉపేందర్, నల్లబోతు వేణు, చింతల మహేష్, జక్కల నాగరాజు, సముద్రాల వేణు, బత్తుల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

### మోసపూరిత హామీలతో ముందుకు వచ్చిన

# కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికలలో బుద్ధి చెప్పాలి

### గాదరి కిషోర్ కుమార్, క్యామ మల్లేష్



నూతనకల్, మేజర్‌న్యూస్ : మోసపూరిత హామీలతో ముందుకు వచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికలలో ప్రజలు తప్పక బుద్ధి చెప్పాలని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్, భువనగిరి పార్లమెంటు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి క్యామ మల్లేష్‌లు అన్నారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం మాట్లాడారు. అమలు కానీ హామీలతో ప్రజలను మభ్యపెట్టిన కాంగ్రెస్ పార్టీ గెలిచిన తర్వాత హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలన్నింటిని యధావిధిగా కొనసాగించకుండా ఆ పథకాలన్నింటికి స్వస్తి పలకడంతో పాటు వారు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన పథకాలను సైతం అమలు చేయలేదని విమర్శించారు. ఇంతగా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని పార్లమెంటు ఎన్నికల్లో ఓడించి వారికి తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. బిఆర్ఎస్ పార్టీలో తమ వెంట ఉండి అన్ని విధాలుగా లబ్ధి పొందిన కొంతమంది నాయకులు తమ స్వార్థం కోసం కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని, అలాంటివారు వెళ్లినంత మాత్రాన తమ పార్టీకి వచ్చే ఇబ్బంది ఏమీ లేదని ఉన్నటువంటి కార్యకర్తలు, నాయకులతోనే తమ పోరాటం కొనసాగించి మళ్లీ భవిష్యత్తులో అధికారంలోకి రావడం ఖాయమని ఉన్నటువంటి బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తుంగతుర్తి నియోజకవర్గ ప్రజలందరికీ తాము అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలేరు మాజీ శాసనసభ్యులు బూడిద బిక్షమయ్య గౌడ్, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మున్న మల్లయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి బత్తుల సాయిల్ గౌడ్, వైస్ ఎంపీపీ జక్కి పరమేష్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గాజుల తిరుమలరావు, ఎర్రపహాడ్ ఎంపీటీసీ గాడుదుల రజిత లింగరాజు, నాయకులు చూడి లింగారెడ్డి,కొచ్చర్ల బాబు, సురేందర్ నాయక్, నర్సింగ్ నాయక్, విక్కీ బుచ్చయ్య గౌడ్, బత్తుల విజయకుమార్, బత్తుల విద్యాసాగర్, పసునూటి అయోధ్య, అనిల్, కనకటి మహేష్, పెద్దింటి మధు, మోజేష్, వెంకన్న పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్న నామినేషన్‌కి కదిలిన కాంగ్రెస్ నాయకులు



కొండమల్లేపల్లి, మేజర్‌న్యూస్ : నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలోని కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలు భాగంగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ బలపరిచిన పట్టభద్రుల అభ్యర్థి తీన్మార్ మల్లన్న నామినేషన్‌కు కొండమల్లేపల్లి మండలం నుండి కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు పత్రికా రంగంలో రాణిస్తూ ప్రజా గొంతుకకై బిఆర్ఎస్ పార్టీని ఎదిరించి అలుపెరుగని పోరాటాలు చేసి కేసీఆర్ ఆగడలను బట్టబయలు చేసిన ప్రజాగొంతూక తీన్మార్ మల్లన్నను చట్టసభల్లో పంపించేందుకు ప్రతి ఒక్కరు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమన్ రెడ్డి, సీనియర్ నాయకులు పెద్దిశెట్టి సుధాకర్, స్వామి నందీశ్వర్, గంధం సురేష్, నీలం శ్రీనివాస్ యాదవ్,ఎస్సీ సెల్ నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు యేకుల సురేష్, తీన్మార్ మల్లన్న కమిటీ నియోజకవర్గ ఇన్చార్జ్ నాగటీ హరీష్, క్యు న్యూస్ దేవరకొండ ఇంచార్జ్ ఆడేపూ సతీష్ యువజన కాంగ్రెస్ దేవరకొండ కార్యదర్శి ఏకుల అంబేద్కర్, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి ఊంజల్ సేవా

యాదగిరి కొండ, మేజర్‌న్యూస్ : ప్రముఖ పుణ్యక్షేత్రంలో యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం శుక్రవారం ఆలయంలో నిత్య పూజలతో పాటు సంప్రదాయ పర్వాలు నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభులకు ఆస్థాన పరంగా పూజించిన తదుపరి సాయంత్రం వేళ ఆండాళ్ అమ్మవారి ప్రత్యేక అలంకరణలతో తీర్చిదిద్ది ఉంజల్ సేవా ఉత్సవాన్ని చేపట్టారు. ముత్యాల పల్లకి పై అలంకృత అయిన అమ్మవారిని ఆరాధిస్తూ పూజారులు హారతి నివేదించారు. ఆస్థాన విద్వాంసులు సన్నాయి రాగాలు డోలు వాయిద్యాలు మేళతాళాల తో సంకీర్తనలు పలికించి అమ్మవారికి నివేదన సమర్పించారు. ప్రధాన ఆలయంలో శుక్రవారం పురస్కరించుకొని ఆండాళ్ అమ్మవారి ఉంజల్ సేవ మహోత్సవం ఆలయ అర్చకులు నిర్వహించారు. శుక్రవారం వివిధ కైంకర్యాల్లో వచ్చిన ఆదాయం 31,99,066.



# స్వామి వారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ



యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : భారీ కాన్వాయ్‌తో నామినేషన్ దాఖలుకు బయలుదేరి వెళ్లిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న. వరంగల్, ఖమ్మం, నల్లగొండ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న నామినేషన్ దాఖలులో భాగంగా ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో కలిసి శుక్రవారం యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్వగృహంలో ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నని శాలువాతో సన్మానించి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. అక్కడ నుండి భారీ కాన్వాయ్‌తో నల్లగొండలో జరిగే నామినేషన్ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆధ్వర్యంలో ఆలేరు నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున్న తరలివెళ్లారు.

# బిజెపితోనే దేశాభివృద్ధి సాధ్యం

### భువనగిరి పార్లమెంటు

### బిజెపి అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్

భూదాన్‌పోచంపల్లి, మేజర్‌న్యూస్ : బిజెపితోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని భువనగిరి ఎంపీ అభ్యర్థి మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ అన్నారు.శుక్రవారం బిజెపి లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా అంబేద్కర్ విగ్రహం నుండి నేతాజీ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీ బూర నర్సయ్య గౌడ్ బిజెపి రాష్ట్ర నాయకులు గూడూరు నారాయణరెడ్డి రథంపైప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ దేశానికి సుస్థిర పాలన సమర్థమైన నాయకత్వాన్ని నిర్వహిస్తూ భారత దేశ అభివృద్ధిని ప్రపంచానికి చాటుతుంది బిజెపి పాలన అని అన్నారు. తన పార్లమెంటు పరిధిలో గతంలో 9 వేల కోట్ల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని అన్నారు. తాను చేసిన అభివృద్ధిపై కాంగ్రెస్ నాయకులు లేనిపోని ప్రకటనలు చేస్తున్నారని అభివృద్ధి పై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. దేశం ,ధర్మం ,అభివృద్ధి నరేంద్ర మోడీతోనే సాధ్యం అవుతుందని అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలతో ప్రజలను మభ్యపెడుతుందని, ఈ ఎన్నికలలో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు చెప్పాలని వారన్నారు.మోడీ నాయకత్వంతో గ్రామాల అభివృద్ధితోపాటు ప్రజాసంక్షేమంతో బిజెపి పాలన ముందుకు సాగుతుందని ఆయన అన్నారు. స్థిరంలేని నాయకత్వం లేని నినాదాలు కాంగ్రెస్ పార్టీ వెళుతుందని ఆయన విమర్శించారు. దేశ అభివృద్ధి సుస్థిరం కావాలంటే అది మోడీతోనే సాధ్యమవుతుందని దానికి అనుగుణంగా రానున్న లోక్ సభ ఎన్నికల్లో మరోసారి బిజెపి కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్ ,బిజెపి రాష్ట్ర నాయకులు దాసరి మల్లేష్, ధనంజయ, బిజెపి ప్రధాన కార్యదర్శి యన్నం శివకుమార్, రాష్ట్ర నాయకులు సురకంటి రంగారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, జిల్లా చేనేత సెల్ కన్వీనర్ గంజి బసవలింగం, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు చొక్కా రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు బండిరాల సుశీల, మండల, పట్టణ శాఖ అధ్యక్షులు గుండ్ల రాజు యాదవ్, డబ్బికార్ సాహెష్, ప్రధాన కార్యదర్శి భైరువెంకటేష్ గౌడ్, నాయకులు నోముల గణేష్,ఏలే శ్రీనివాస్, తండ రమేష్ గౌడ్, చెరుకు వెంకటేష్, వినయ్, చేరాల లింగయ్య,సైదుగాని స్వామి, యువ మోర్చా నాయకులు శ్రీకాంత్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

